


● ద్వారకా తిరుమలలో.. చిన్నా పెద్దా తేడా లేదు.. స్వామి దర్శనంతో పులకించిన భక్త జనం



● ఉత్తర ద్వారం నుంచి దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి.. హారతి చూపుతున్న అర్చకస్వామి



నేత్ర పర్వం.. ఉత్తర ద్వార దర్శనం



● ప్రతిధ్వనించిన శంఖారావం

ద్వారకా తిరుమల, జనవరి 10(ఆంధ్రజ్యోతి):ద్వారకా తిరుమల వాసుని దివ్య క్షేత్రం ఇల వైకుంఠాన్ని తలపించింది. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారుజామున సర్వాభరణ భూషితుడై, పుష్పాలంకరణలతో గరుడ వాహనారూడుడైన చిన్న తిరుమలేశుడు ఉభయ దేవేరులతో కలిసి ఉత్తర ద్వారం వద్ద భక్తులకు సాక్షాత్కరించారు. శ్రీ మహా విష్ణువు ఆవాసమైన వైకుంఠంలో విష్వక్సేన, గరుడ, అనంతాది నిత్యశూరులు, సమస్త రుషిగణాలు, ముక్కోటి దేవతలు.. ఉత్తర ద్వారం నుంచి శ్రీ హరిని దర్శించుకునే సేవ ధ్యమే ఈ ముక్కోటికి ప్రేరణ. తెల్లవారు జామున గోవింద దీక్షాదారులు తొలి మెట్టు వద్ద విశేష పూజలు, భజనలు చేశారు. గోవింద నామాన్ని, శంఖు, చక్రాలను కర్పూరంతో తయారుచేసి వాటిని వెలిగించి స్వామి దర్శనానికి వెళ్లారు. ఉదయభానుని లేలేత కిరణాలు పుడమిపై ప్రసరించే వేళ.. భక్తులు, దీక్షాదారుల గోవింద నామస్మరణలు, అర్చకుల వేద మంత్రోచ్చరణలు, మేళ తాళాలు, సన్నాయి, డోలు వాయిద్యాల నడుమ.. ఉత్తర ద్వారాలు తెరుచుకునే శుభ ఘడియలో.. వెండి గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుతీరిన ఆ దేవదేవుడు నీరాజనాలు అందుకుంటూ భక్త జన కోటికి దర్శనభాగ్యాన్ని కలుగజేశారు. గోవింద దీక్షను తలపెట్టిన గోవిందస్వాములు, భక్తులు శ్రీవారి దివ్య మంగళ స్వరూపాన్ని వీక్షించి పరవశించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణారావు, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శ్రీవారిని దర్శించి తరించారు.

గోవింద నామస్మరణతో పులకించిన ద్వారకాతిరుమల

ఉత్తరద్వార దర్శనం తర్వాత దివ్యమూర్తులను పాత సంప్రదాయం ప్రకారం దక్షిణ రాజ గోపురం వద్దకు తీసుకెళ్లడంతో శ్రీవారి పూజా మూర్తులు వెండి శేష వాహనంపై కొలువుదీరి భక్తులను ఉత్తర ద్వారం వద్ద అభయ ప్రదానం చేశారు. సాయంత్రం వరకూ శ్రీవారు భక్తులకు శేష వాహనంపై ఉండి దర్శన భాగ్యాన్ని కలిగించారు. ఆపై తిరువీధుల్లో ఊరేగించారు.

గోవిందా.. గోవింద

భక్తులతో పోటెత్తిన పారిజాతగిరి, చనుబండ ఆలయాలు

ఏలూరు /చాట్రాయి : జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం స్వామికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయం వద్ద ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, డీఎస్పీ రవిచంద్ర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈవో మానికల రాంబాబు, ప్రధానార్చకులు నల్లూరు రవికుమారాచార్యులు, కూటమి నాయకులు రావూరి కృష్ణ, దాసరి శ్యామ్‌చంద్ర శేషు, పెనుమర్తి రామకుమార్, పరిమి సత్తిపండు, తదితరులు పాల్గొన్నారు. అపర భద్రాద్రిగా పేరు గాంచిన చాట్రాయి మండలం చనుబండ కోదండరామస్వామి ఆలయంలో తెల్లవారుజామున ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి దంపతులు పూజలు అనంతరం భక్తులను ఉత్తరద్వార దర్శనానికి అనుమతించారు. తెలంగాణ పరిధిలోని వేంసూరు తహసీల్దార్ ఎంఏ రాజు, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు తదితరులు దర్శించుకున్నారు. ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



చనుబండలో స్వామివారు


‘ప్రైవేటు’ దోపిడీ

» మూడింతలు టిక్కెట్ల ధరలు పెంచిన ప్రైవేటు ట్రావెల్స్

(ఏలూరు- ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రైవేట్ ట్రావెలర్స్ ధరల దందాను చూసి ప్రయాణికుల గుండెలు గుభేలుమంటున్నాయి. పెద్ద పండుగకు తమ సొంత ఊర్లకు వెళ్లటానికి ఎంత ఖర్చు పెట్టడానికైనా వెనుకాడరని భావించి ట్రావెల్స్ యాజమాన్యాలు క్యాష్ చేసుకుంటున్నాయి. ఆర్టీసీ బస్సుల ప్రయాణాలకు రెండు నెలలు ముందే టిక్కెట్లు బుక్ చేసుకోవడంతో అవి నిండిపోయాయి. దీంతో ప్రైవేట్ బస్సులే ఆధారం కావడంతో అమాంతంగా ధరలను పెంచేశారు. ఏలూరు నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సు ధర సగటున రూ.700 నుంచి రూ.900 మధ్య ఉంటే ప్రైవేట్ ట్రావెల్స్ సగటున మూడింతల పైనే ముక్కుపిండి వసూళ్లకు తెగబడుతున్నారు. ఒక్క హైదరాబాద్‌కే నాన్ ఏసీ టిక్కెట్‌ను రూ.1700 పైనే వసూలు చేస్తుండగా, ఏసీ టిక్కెట్ ధర రూ.2వేల పైమాటే. చెన్నైకు నాన్ ఏసీ స్లీపర్‌కు రూ.4,500, ఏసీకి రూ.5వేల పైనే వసూలు చేస్తున్నారు. విశాఖకు రూ.2వేల పైనే టిక్కెట్ ధర ఉంది. సంక్రాంతికి స్పెషల్ ట్రైన్లను రైల్వేశాఖ నడుపుతోంది. అయితే ట్రాక్‌ల మరమ్మతుల కారణంగా రెగ్యులర్‌గా నడిచే రైళ్లను సైతం రద్దు చేయడం, రూట్ మార్చి నడపడంతో అవస్థలు పడలేక రైళ్ల వైపు ప్రయాణికులు అంతగా చూడడం లేదు. ధర ఎక్కువగా ఉన్నా ప్రైవేట్ ట్రావెల్ బస్సుల్లోనైనా తమ సొంతూర్లకు చేరుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా తిరుగు ప్రయాణంలోను ట్రావెల్స్ యాజమాన్యాలు ఇప్పటి నుంచే చుక్కలు చూపిస్తున్నారు. తిరుగు ప్రయాణం టిక్కెట్లు బుక్ అయిపోయినట్టు జిమ్మిక్కులు చేస్తున్నారనే విమర్శలున్నాయి.

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు : షేక్ కరీమ్, డీటీసీ



పండుగను పురస్కరించుకుని ట్రావెల్ యాజమాన్యాలు అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ట్రావెల్ యాజమాన్యాలతో సమా వేశం ఏర్పాటు చేశాం. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

మాకో కుర్చీ ప్లీజ్..



బీజేపీలో ఇంతకుముందెన్నడూ లేని రీతిలో ఈసారి పదవుల కోసం నేతల మధ్య పోటాపోటీ నెలకొంది. గతంలో బూత్ దగ్గర నుంచి జిల్లా స్థాయి వరకు అనేక పదవులు భర్తీ చేయడానికి సీనియర్లంతా నానా తిప్పలు పడేవారు. కాని ఈ దఫా క్షేత్రస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు పార్టీలో సంస్థాగతపరంగా మార్పులు, చేర్పులు చేయతలపెట్టారు. పార్టీ కోసం కష్టపడేవారిని ముందుకు తీసుకెళ్లడమే ప్రాధాన్యతగా ఎంచుకున్నారు. వారంలోపే జిల్లా పార్టీ అధ్య క్షుడిని సైతం ఎన్నుకోవాలని కమల నాథులు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారు.

బీజేపీలో పదవుల కోసం భారీగా పోటీ

» అధ్యక్ష స్థానం బరిలో ఆరుగురు
» మండలాధ్యక్ష పదవుల్లోను నువ్వానేనా
» ఈసారి పోటీ చూసి షాక్ అవుతున్న సీనియర్లు
» కమలంలో ఈసారి సరికొత్త ఒరవడి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

కమలంలో పదవుల కసరత్తు. సంస్థాగతంగా పెద్దఎత్తున మార్పులు, చేర్పులకు సిద్ధమైన బీజేపీ అందుకు తగ్గట్టుగానే గత కొద్ది రోజులుగా బూత్‌స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల ఏర్పాటు దిశగా సభ్యత్వ నమోదులను వేగవంతం చేసింది. గతంకంటే ఈసారి బీజేపీలో ఉత్సాహం తాండవిస్తోంది. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉండడం ఇందుకు ప్రధాన కారణం. ఈ నేపథ్యంలోనే పార్టీపరంగా లభించే పదవులన్నింటిలోనూ ఏదొక దానిని సొంతం చేసుకోవాలనే కాంక్షే కొందరు కమల నాథుల్లో కనిపిస్తోంది. ప్రతీ మూడేళ్లకోసారి జిల్లా కమిటీని ఎన్నుకోవడం ఆనవాయితీ. ఈసారి జాతీయ స్థాయిలో పార్టీ సంస్థాగత మార్పుల్లో భాగంగా ఈలోపే ఎన్నికలు నిర్వహించాలని భావిస్తుండడంతో ఇప్పటికే జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న విక్రమ్ కిశోర్ ఏడాదిన్నర పదవీ కాలం మాత్రమే పూర్తయ్యింది. ప్రతీసారి జిల్లా అధ్యక్ష పదవి విషయంలో పార్టీలో పెద్ద పోటీ ఉండేదికాదు. సాధ్యమైనంత మేర అధ్యక్ష పదవికి ఏనాడూ ఎన్నిక జరగకపోగా దాదాపు అందరూ ఏకగ్రీవమే. ఈసారి ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్‌తోపాటు మరో ఐదుగురికి పైగా సీనులో ఉన్నారు. ఉంగుటూరు నియోజకవర్గానికి చెందిన రామచంద్రరాజు (దుబాయ్ రాజు), అశోక చక్రవర్తి వర్మ, కొయ్యలగూడెంకు చెందిన కారంకి శ్రీనివాస్, దెందులూరు నియోజకవర్గానికి చెందిన కృష్ణప్రసాద్, ఏలూరుకు చెందిన విజయ్ పోటీలో ఉన్నారు. ఈక్రమంలో బీజేపీలో సీనియర్లు సైతం ప్రస్తుత జిల్లా అధ్యక్ష పదవి ఎవరికిస్తే సముచితంగా ఉంటుందో ఇప్పటికే అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఏలూరులో జరిగిన ఒక సమావేశంలో కొంతమంది జిల్లా నాయకత్వం బాధ్యతలను మోసే వ్యక్తులు ఎవరో సీనియర్లకు చెప్పకనే చెప్పారు. సీనియర్లు ఈ విషయంలో మరింత కసరత్తు చేసి సంక్రాంతి సమయంలోనే ఓ నిర్ణయానికి రాబోతున్నారు.

అభిప్రాయ సేకరణ అంటూనే..

బీజేపీలో ఇప్పుడు సంస్థాగత ఎన్నికల ఊపు కనిపిస్తోంది. జిల్లాలో 1743కు పైగా బూత్ కమిటీలు ఉండగా వీటన్నింటికీ అధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంది. ప్రత్యేకించి ఏ బూత్‌లో అయితే తాము నిర్దేశించినట్టుగా సభ్యత్వ లక్ష్యం అందుకుంటారో ఆ కమిటీలకే ఎన్నికలు నిర్వహిస్తామని బీజేపీ ఓ షరతు పెట్టింది. దీంతో వీటిలో సగానికి సగం పైగా అధ్యక్షుడు ఎవరో ఇప్పటికే తేల్చేశారు. మిగతా సగానికి సగం బూత్‌ల్లో త్వరలోనే అధ్యక్ష నియామక ప్రక్రియ పూర్తికాబోతుంది. ఏలూరు జిల్లాను 35 మండలాలుగా విభజించి సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తుంది. ఏలూరు నగరాన్ని ఐదు మండలాలుగా, నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడిని రెండేసి మండలాలుగా విభజించారు. దీంతో మండలాల సంఖ్య పెరిగినట్టయ్యింది. భీమడోలు, దెందులూరు వంటి మండలాలన్నింటిలోనూ అధ్యక్ష స్థానాన్ని అందుకునేందుకు నేతల మధ్య పోటీ నెలకొనడం సీనియర్లను సైతం ఆశ్చర్య పరుస్తోంది. మండల స్థాయిలో మండల అధ్యక్షునితో పాటు మరో ప్రతినిధిని ఎన్నుకుంటున్నారు. ఇప్పటివరకు సగం మండలాల్లో అభిప్రాయ సేకరణ మేరకు అధ్యక్షుడిని ఎవరిని చేయాలనే విషయంలో ఒక స్థిర నిర్ణయానికి వచ్చేశారు. పార్టీ అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

తపన చౌదరే స్ఫూర్తి

బీజేపీలో వీరవిధేయుడిగా ఉన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపన చౌదరి స్ఫూర్తితో నే అత్యధికులు పార్టీ కార్యక్రమాల్లో ఇన్నాళ్ళు నిమగ్నమయ్యారు. గత ఎన్నికల్లో తపన చౌదరికి ఏలూరు పార్లమెంటు స్థానాన్ని కేటాయిస్తే ఆ మేరకు రంగం లోకి దిగి ఆయనను గెలిపించుకో వాలన్న రీతిలో పార్టీ పక్షాన అత్యంత కీలకంగా వ్యవహరించారు. అదే స్ఫూర్తితో ఈమధ్యన నిర్వహించిన హైందవ శంఖారావం సభకు ఏలూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ ప్రతినిధులుగా ఉండేందుకు పలువురిలో ఆసక్తి పెరిగింది.

వనామీ రొయ్యకు..
మంచు గండం

» ఉదయం వేళ దట్టంగా కురుస్తున్న మంచు
» ఆక్సిజన్ అందక చనిపోతున్న రొయ్యలు
» కౌంటుకు రాకుండానే పట్టుబడితో నష్టాలు

కలిదిండి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉదయం వేళల్లో మంచు దట్టంగా పడుతుండడంతో చెరువుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడి వనామి రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 2.90 లక్షల ఎకరాల్లో చేపలు, రొయ్యలు సాగు చేస్తున్నారు. ఇందులో 1.80 లక్షల ఎకరాల్లో చేపలు, లక్షా పది వేల ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో ఉదయం వేళ మంచు పడుతుండటంతో కైకలూరు, ఉండి, ఏలూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లోని పలు చెరువుల్లో రొయ్యలు చనిపోతున్నాయి. ఈ కారణంగా కౌంటుకు రాకుండానే చిన్న సైజు రొయ్యలను హడావిడిగా పట్టుబడి చేయాల్సి రావడంతో గిట్టుబాటు ధర రావటం లేదని రైతులు వాపోతున్నారు. ఎకరానికి లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టారు. అయితే కనీసం ఖర్చులు కూడా రాకపోవడంతో అప్పుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చనిపోయిన రొయ్యలు ఎరుపు రంగులోకి మారటంతో వ్యాపారులు కొనకపోవడంతో వాటిని గోతుల్లో వేసి పూడుస్తున్నారు. ఆక్సిజన్ అందించేందుకు లక్షల రూపాయల వ్యయంతో చెరువుల్లో ఏరియేటర్లు ఏర్పాటు చేస్తున్నప్పటికీ ఫలితం ఉండటం లేదని వారు వాపోతున్నారు. రొయ్యలు చనిపోతుండటంతో వ్యాపారులు సిండికేటుగా మారి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని, రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేసవిలో రొయ్యల సాగుకు అనుకూలం

వేసవిలో వనామి రొయ్యల సాగుకు వాతావరణం అనుకూలంగా ఉంటుందని మత్స్యశాఖ అధికారులు పేర్కొన్నారు. వేసవిలో ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో వైరస్ ప్రభావంతోపాటు వ్యాధులు సోకే ప్రమాదం తక్కువగా ఉంటుందని చలి తీవ్రత, మంచు తక్కువగా ఉండటంతో ఆక్సిజన్ కొరత ఏర్పడదన్నారు. గతంలో వేసవిలో రొయ్యల సాగు అనుకూలంగా ఉండటంతో విదేశీ మారకద్రవ్యం కోట్లాది రూపాయలు వచ్చిందన్నారు. ఫిబ్రవరి నెలాఖరుకల్లా రొయ్యల సాగు ప్రారంభానికి వాతావరణం అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

'మంచు కారణంగా చెరువుల్లో తెట్టు ఏర్పడి ఆక్సిజన్ కొరత ఏర్పడుతోంది ఉదయాన్నే చెరువుల్లో బోట్లను తిప్పుతూ ఆయిల్ ఇంజన్లతో నీటిని రీ సైక్లింగ్ చేయడంతో చెరువుల్లో కెరటాలు వచ్చి ఆక్సిజన్ ఉత్పన్నమవుతుంది. ఏరియేటర్లు తిరుగుతూ ఉండాలి. మేతలు తక్కువ వేయాలి. వ్యాధులు సోకితే ల్యాబ్‌ల్లో పరీక్షలు జరిపి మందులు వాడాలి' అని మత్స్యశాఖాభివృద్ధి అధికారి రవికుమార్ సూచించారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



ఐదు ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నా. ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి పెట్టా. మంచు కారణంగా ఆక్సిజన్ లోపంతోపాటు వ్యాధులు సోకి రొయ్యలు మృత్యువాత పడుతు న్నాయి. చనిపోయిన రొయ్యలను వ్యాపారులు సిండికేటుగా మారి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలి. - ముద్దం బుల్లి వెంకయ్య, ఆక్వా రైతు



చనిపోయిన వనామి రొయ్యలు





తెల్లవారుజాము నుంచే చిన వెంకన్న దర్శనానికి క్యూలో భక్తులు



వెండి గరుడవాహనంపై ఊరేగుతున్న చిన వెంకన్న..



ముక్కోటి ఏకాదశి పూజలతో వైష్ణవాలయాలు కిటకిటలాడాయి.. ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తకోటి స్వామివార్లను దర్శించి తరించారు.. ద్వారకాతిరుమలలో తెల్లవారు జాము నుంచే

నమో వేంకటేశాయ

భక్తులు పెద్ద సంఖ్యలో చిన వెంకన్నను దర్శించారు. కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి, జంగారెడ్డిగూడెం పారిజాతగిరి, పెంటపాడు బైరాగిమఠం క్షేత్రాలతో పాటు ప్రసిద్ధ ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు చేశారు..



జంగారెడ్డిగూడెం గోకుల పారిజాతగిరి ఆలయంలో స్వామి దర్శనం కోసం..



కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి దర్శనానికి క్యూలో భక్తులు



పెంటపాడు బైరాగిమఠంలో ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆచంట మండలం కొడమంచిలిలో రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పితాని, భక్తులు



ద్వారకాతిరుమలలో స్వామివారిని దర్శించుకునేందుకు క్యూ లైన్లలో భక్తులు









← ముక్కోటి సందర్భంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు →



కొల్లేరు ప్రాంత విద్యార్థులకు వరం

దుంపగడప డిగ్రీ కళాశాలలో రేపు స్వర్ణోత్సవాలు

ఆకివీడు రూరల్ జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు మండలం దుంపగడప వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవాలకు సమయాత్తమవుతున్నది. కళాశాల ఏర్పాటు చేసి 50 వసంతాలు పూర్తవడంతో ఈనెల 12వ తేదీ ఆదివారం కళాశాలలో వేడుకలు నిర్వహించనున్నారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, 50 సంవత్సరాల పైలాన్ ఆవిష్కరణ, గురువులకు సన్మానం జరుగుతుందని పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు గొంట్లా కృష్ణమూర్తి తెలిపారు.ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఐఎస్‌డీఎస్ ఆర్జేడీ శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ నాగరాణి, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరు బాపిరాజు తదితరులు హాజరు కానున్నారు.

గ్రామీణ ప్రాంత వాసులకు విద్యాభ్యాసం అందుబాటులో లేని రోజులలో పేద విద్యార్థులు విద్యకు దూరం కాకుడదనే సంకల్పంతో గాంధేయవాది చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు తన తండ్రి బాపిరాజు ధర్మసంస్థ పేరున 1974లో మాజీ రాష్ట్రపతి వరాహగిరి వెంకటగిరి (వీవీ గిరి)బీఏ, బికామ్ కోర్సులతో 60 మంది విద్యార్థులతో ఒక పాకలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేశారు. మొలుగు రఘు నాధాచార్యులు, పలువురు దాతల సహకారంతో 14.05 ఎకరాలలో కాలేజీ విస్తరించింది. 2000లో బీఎస్సీ (ఎంసీసీఎస్), 2009లో బీఎస్సీ (ఎంపీసీ) కోర్సులు వచ్చాయి. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి 2012 నుంచి ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ పరిధిలోకి మారింది. ప్రస్తుతం బీఏ, బికామ్ కోర్సులతో పాటు, బీఎస్సీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కాలేజీలో రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్, ప్రధానమంత్రి విశ్వకర్మ, స్కిల్ హబ్‌ల ద్వారా విద్యార్థులకు సర్టిఫికెటెడ్ వృత్తి విద్యాకోర్సులు అందిస్తున్నారు.

పేద విద్యార్థుల కోసం ఉచిత బస్సు

దూరం నుంచి వచ్చే పేద విద్యార్థుల కోసం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. కెనరబ్యాంకు సౌజన్యంతో కాలేజీకి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్న దూర ప్రాంతాల్లోని విద్యార్థులను ఉచితంగా కాలేజీకి తీసుకు వస్తున్నారు. కాలేజీ డవలప్‌మెంట్ కమిటీ, పూర్వ విద్యార్థి సంఘాలు, కాలేజీ అభివృద్ధిలో కీలక భూమిక పోషించాయి. క్రీడల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్నారు.





కెనరాబ్యాంకు అందించిన ఉచిత బస్సు

జాతీయ నాయకుల విగ్రహాలతో తీర్చిదిద్దిన కళాశాల ప్రాంగణం

మార్కెట్లకు సంక్రాంతి కళ

వస్త్ర దుకాణాలు కిటకిట

ఆఫర్లతో హోరెత్తిస్తున్న షాపింగ్ మాల్స్, మోటార్ సైకిల్ షోరూంలు

ఏలూరుసిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వచ్చిందంటేనే మార్కెట్లు కళకళలాడు తుంటాయి. ఏలూరు నగరంతో పాటు జిల్లాలోని ముఖ్య పట్టణాలైన జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు, కైకలూరు తదితర ప్రాంతాల్లో వస్త్ర దుకాణాలు, షాపింగ్ మాల్స్ కిటకిట లాడుతున్నాయి.వస్త్ర దుకణాల్లో ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు.ప్రతి రోజు గిఫ్ట్ ఓచర్లు, సంక్రాతికి బంపర్ డ్రా గిఫ్ట్ ఓచర్లతో పాటు అక్కడ కొనుగోలుకు బట్టి వివిధ రకాల ఆఫర్లను ప్రకటించారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాల షోరూంలలో కూడా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించటంతో ఫ్రిజ్‌లు, టివిలు. ఏ/సిలు, వాషింగ్ మిషన్లు, మైక్రోఓవెన్స్, వెట్ గ్రైండర్లు, మిక్సీలు వంటి వాటి కొనుగోలుపై వినియోగదారులు దృష్టి సారించారు. సంక్రాంతి వస్తోందంటే కొత్త వాహనాలను కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. వినియోగదారులను ఆకర్షించే విధంగా మోటార్ సైకిల్ షోరూంలు ప్రత్యేక ఆఫర్లు ప్రకటిం చారు. మెగా లోన్ అండ్ ఎక్సేంజ్ మేళాలను నిర్వహిస్తున్నారు. ఏలూరు సాయి స్వర్ణా మోటార్స్ వారు ఫ్లాష్ సేల్



పేరుతో ఏలూరు నగరంలో పలు చోట్ల ఫ్లాష్ సేల్ పాయింట్లును ఏర్పాటు చేశారు. ప్రతి హీరో వాహనం కొనుగోలుపై 5వేల రూపాయల వరకు క్యాష్‌బ్యాక్ ఆఫర్లు లేదా ఎక్సేంజ్ బోనస్ ఇస్తున్నారు. క్యాష్ ఎంపిక చేసిన బ్యాంకు కార్డులు ద్వారా కొనుగోలుపై 15 వేల రూపాయిల వరకు తగ్గింపు ఇస్తున్నారు. అతి తక్కువ డౌన్ పేమెంట్ 3,999 రూపాయలతో వాహనాలు కొనుగోలు చేయటానికి అవకాశం కల్పిస్తున్నారు. గతంతో పోలిస్తే ఈసారి పోటీతత్వం పెరిగిందని, దీంతో ఆఫర్లు పెంచినా అమ్మకాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటున్నాయని మోటార్ సైకిల్, ఎలక్ట్రానిక్ వస్తువుల షోరూం , వస్త్రదుకాణాల యజమానులు చెబుతున్నారు.

అమ్మకాలు పుంజుకున్నాయి..



జనవరి 1వతేదీ నుంచి మార్కెట్‌లో అమ్మకాలు కొంత పుంజుకున్నాయి. ముక్కోటి ఏకాదశి, దశమి రోజుల్లో



అమ్మకాలు మెరుగ్గా కనిపించాయి.దసరా పండుగ నుంచి మార్కెట్‌లో అంతంత మాత్రంగానే అమ్మకాలు జరిగినా ఇప్పుడు కొత్త వాహనాలు కొనుగోలు పెరిగింది. పండుగ నాటికి అమ్మకాలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏలూరులోని పలు ప్రాంతాల్లో ఎక్సేంజ్ మేళాలు నిర్వహిస్తున్నాం.

- సోమేశ్వరరావు, జనరల్ మేనేజర్ , సాయి స్వర్ణ మోటార్స్, ఏలూరు

పందేలకో లెక్కుంది !

జాతకం, జన్మ నక్షత్రం, వాస్తు శాస్త్రం మానవులకే కాదందోయ్.. కోడి పుంజులకు ఉన్నాయ్. కుక్కుట శాస్త్రాన్ని ఎవరు రచించారో గానీ సంక్రాంతి సందర్భంగా పందెం రాయుళ్లు ఈ శాస్త్రాన్ని బాగా అధ్యయనం చేస్తుంటారు.. కోడి పుంజులు వాటి వర్గీకరణ, ఏ రోజున ఏ దిశలో పందెం కాయాలి..? ఏ...నక్షత్రానికి ఏ పుంజును వదిలితే విజయం సాధిస్తుంది.. ఇలాంటి అంశాలపై లెక్కలు కడుతుంటారు..

జాతకాలు చూసి మరీ బరిలోకి..


కుక్కుట శాస్త్రాన్ని అధ్యయనం చేస్తున్న పందెం రాయుళ్లు



పాలకొల్లు, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పురస్కరించుకుని ఉభయగోదావరి జిల్లాల్లో సంప్రదాయ బద్ధంగా నిర్వహించే కోడి పందేలలో ఏ రోజున ఏ పుంజును కాస్తే పందెం గెలుస్తుందో కుక్కుట శాస్త్రంలో వివరించారు. పందెం వేసే రోజు నక్షత్రాన్ని బట్టి తారాబలం చూసి కోడి రంగు, జాతిని ఎంపిక చేసి పందెం వేస్తుంటారు. 13వ తేదీ భోగి సందర్భంగా గౌడ నెమలి, నెమలికి చెందిన పుంజులు 14వ తేదీ సంక్రాంతి రోజున యాసర, కాకి, డేగ కాకి నెమలి, కాకి డేగలకు చెందిన పుంజులు పందెంలో సునాయాశంగా గెలుస్తాయి. 15వ తేదీ కనుమ రోజు డేగలు, ఎర్ర కాకి డేగలు గెలిపొందుతాయని కుక్కుట శాస్త్రం చెబుతోంది.

నక్షత్రాన్ని బట్టి ఫలితాలు

నక్షత్ర ప్రభావం కేవలం మానవుల మీదే కాకుండా పక్షులు, జంతువులు మీద కూడా ప్రభావం ఉంటుందని నమ్ముతారు. కోడిపుంజుల్లో రక్త ప్రసరణపై గ్రహ ప్రభావం ఉంటుందని 27 నక్షత్రాల్లో పందెం కోళ్ల వాటి ప్రభావాలు ఎలా ఉంటాయో కుక్కుట శాస్త్రంలో వివరించారు. అశ్విని నక్షత్రంలో నెమలి, డేగ పుంజుల మీద కాకి నెగ్గుతుందని గౌడు రకం పుంజు మీద పింగళి నెగ్గుతుందని విశ్వసిస్తారు. ఇలా 27 నక్షత్రాల ఆధారంగా ఏ పుంజుపై ఏ పుంజు గెలస్తుందనే అంశాలను కుక్కుట శాస్త్రంలో వివరించారు.



వార ఫలాలు

ఏ రోజున ఏ దిశలో కోడిపుంజును పందేనికి వదలాలనే దానిపై కుక్కుట శాస్త్రం వివరించింది. ఆదివారం, శుక్రవారం ఉత్తర దిశలోనూ, సోమవారం శనివారం దక్షిణ దిశలోనూ, మంగళవారం తూర్పు బుధ, గురువారాలలో పడమట దిశలోనూ పందేలకు వదలాలి. వారాలను పక్షాలను అనుసరించి కొన్ని జాతుల కోడిపుంజులలో జీర్ణశక్తి కొరవడుతుందని, ఆ సమయంలో పందెంలో పుంజు పరాజయం పాలవుతుందని నమ్ముతారు. ఈ కారణంగా పందేలకు వదిలే కోళ్లను ఆదివారం పింగలి రకం పుంజు, సోమవారం కాకి, మంగళవారం కోడి, బుధవారం నెమలి, గురువారం డేగ, శుక్రవారం పింగలి రకాలను పందేలకు తీసుకువెళుతుంటారు.

దిశ కూడా చూసుకుంటారు..

పందెం కట్టే సమయంలో పందెం రాయుళ్లు దిశ ఎంచుకోవాల్సి ఉంటుంది. పందెం కట్టేవారి పేరు మొదటి అక్షరం అచ్చు అయితే తూర్పు గాని ఆగ్నేయం దక్షిణం, ఉత్తర ఈశాన్యం గాని ఉంటే మంచిది. పందెం కట్టేవారి పేరులో మొదటి అక్షరం ఆధారంగా క, ఖ, గ, ఘ, లలో పందెం కట్టే స్థలం ఆగ్నేయం, నైరుతి, ఈశాన్యం లాభమని భావిస్తారు. కోడి పుంజులను పందేలకు వదిలే సమయంలో నిశ్శబ్ద ప్రాంతాలను కుక్కుట శాస్త్రంలో వివరించారు. రోహిని నక్షత్రంలో పశ్చిమ ముఖంగా పుంజును వదలకూడదు. ఉత్తర పాల్గుణ నక్షత్రంలో ఉత్తర ముఖంగా పందేనికి పుంజును వదలకూడదు. జ్యేష్ఠ నక్షత్రంలో తూర్పు ముఖంగానూ, పూర్వాభాద్ర నక్షత్రంలో దక్షిణ ముఖంగానూ పందేనికి విడవకూడదు.

ఐదు జాములు.. ఐదు అవస్థలు

పక్షి జాతులలో పగటి సమయంలో ఐదు జాములకు ఐదు అవస్థలు చెప్పబడ్డాయి. భోజన అవస్థలో వచ్చిన పుంజు విజయం సాధిస్తుంది. రాజ్యావస్థలో పుంజు సులభంగా జయం పొందుతుంది. గమనావస్థలో పుంజు పందేనికి వినియోగిస్తే సామాన్య లాభం కలుగుతుంది. నిద్రావస్థలో పుంజును పందేనికి వదిలితే అపజయమే కలుగుతుంది. జపావస్థలో పుంజును పందేనికి వదిలితే మృతి చెందుతుందని ఈ శాస్త్రం చెబుతోంది.

ఈకల రంగులను బట్టి పేర్లు

కాకి - నల్లని ఈకలు కల్గిన పుంజు
సేతు - తెల్లని ఈకలు ఉంటాయి
పర్ల - మెడపై నలుపు, తెలుపు ఈకలు సమానంగా ఉన్న పుంజు
సవల - మెడపై నల్లని ఈకలు
కొక్కిరాయి (కోడి) - నల్లటి శరీరం, 2,3 రంగులతో ఈకలు గల కోడిపుంజు,
డేగ - ఎర్రటి ఈకలు కల్గిన పుంజు
నెమలి - రెక్కలపై, లేక వీపుపై పసుపు రంగు ఈకలు ఉంటాయి
కౌజు - నలుపు, ఎరుపు, పసుపు ఈకలు
మైల - ఎరుపు, బూడిద రంగు ఈకలు
పూల - ఒక్కొక్క ఈకపై నలుపు, తెలుపు, ఎరుపు రంగులు ఉంటాయి
పింగళి - తెలుపు రెక్కలపై అక్కడక్కడా నలుపు ,లేత గోధుమ రంగు ఈకలు
అబ్రాసు - లేత బంగారు రంగు ఈకలు

ఇవే కాకుండా మిశ్రమ రకాలు ఉంటాయి.. వాటిలో కోడినెమలి, కాకినెమలి, పచ్చకాకి, తెలుపు గౌడు, (నలుపు, తెలుపు ఈకలు గల కోడిపుంజు), ఎరుపు గౌడు (నలుపు, ఎరుపు ఈకలు గల కోడి పుంజు), నల్లసవల (రెక్కలపై నల్ల మచ్చలు గల కోడిపుంజు), నల్లమచ్చల సేతు (తెల్లని ఈకలపై నల్ల మచ్చలు గల కోడిపుంజు) ఉంటాయి. వీటిలో కాకి, పచ్చకాకి, కాకి నెమలి, డేగ ప్రసిద్ధ రకాలు.. ఇవి ఖరీదైనవి కూడా.

చెత్త ఆధారిత విద్యుత్ ప్లాంట్

కాకినాడ - రాజమండ్రి రూట్‌లో ఏర్పాటుకు యోచన

ఆర్డీ నాగ నర్సింహారావు

నరసాపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల్లోని పురపాలక సంఘాల్లో రోజు రోజుకు పేరుకుపోతున్న చెత్త సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రాజమండ్రి - కాకినాడ రహదారిలో చెత్త అధారిత విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు మునిసిపల్ ఆర్డీ నాగ నర్సింహారావు చెప్పారు. శుక్రవారం నరసాపురం పురపాలక సంఘంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం కొన్ని పురపాలక సంఘాల్లో పేరుకుపోయిన చెత్తను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా రీసైకిలింగ్ చేయిస్తున్నామన్నారు. అయితే ప్రభుత్వం ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలన్న లక్ష్యంతో ఉందన్నారు. గుంటూరులో జిందాల్ తరహాలో ఉభయగోదావరి జిల్లాల్లో కూడా ఒక చెత్త ఆధారిత విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. రీజియన్‌లో ఇంటి పన్ను వసూలులో గుడివాడ, తణుకు, కొవ్వూరు పురపాలక సంఘాలు ముందంజలో ఉన్నాయన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

స్కౌట్స్, గైడ్స్ టీచర్లకు ముగిసిన శిక్షణ

ఏలూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ, సత్ప్రవర్తన, సోదరభావం, నైపుణ్యాల అభివృద్ధి, ఆపదలో సహాయ సహకారాలు అందించడం, నాయకత్వ లక్షణాలు వంటి విలువలు పెంపొందించడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పూర్తి చేసుకున్న టీచర్లు కృషి చేయాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి, గుంటూరుజిల్లాల్లో పీఎంశ్రీ పథకానికి ఎంపికైన ప్రభుత్వ ఉన్నతపాఠశాలల స్కౌట్స్, గైడ్స్ ఉపాధ్యాయులకు స్థానిక హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 4నుంచి నిర్వహిస్తోన్న మాస్టర్స్, కెప్టెన్స్ శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. డీఈవో మాట్లాడుతూ శిక్షణ ముగించుకున్న టీచర్లు తమ పాఠశాలల్లో స్కౌట్స్, గైడ్స్ యూనిట్లను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి భాస్కరకుమార్ మాట్లాడుతూ అకడమిక్ కేలండర్‌లో సూచించిన విధంగా సంబంధిత పాఠశాలల్లో షెడ్యూల్ ప్రకారం స్కౌట్స్, గైడ్స్ శిక్షణ తరగతులను బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించాలన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

ఏలూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని నేషనల్ హెల్త్‌స్కీం(ఎన్‌హెచ్‌ఎం)లో క్వాలిటీ అష్యూరెన్స్, ఆర్‌బీఎస్‌కే-డీఈఐసీ (రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమం) ప్రోగ్రాంలలో వివిధ కేడర్ల ఉద్యోగఖాళీలను ఒక ఏడాది కాంట్రాక్టు కాలపరిమితికి లోబడి భర్తీచేసేందుకు శుక్రవారం డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లా కన్సల్టెంట్, మెడకల్ ఆఫీసర్, క్లినికల్ సైకాలజిస్టు, స్టాఫ్‌నర్సు కేడర్లలో ఒక్కో పోస్టు, ఆడియోలజిస్టు కం స్పీచ్ థెరపిస్టు కేడర్‌లో మూడు పోస్టులను భర్తీచేస్తామని వివరించారు. అర్హతగల అభ్యర్థులు వెస్ట్‌గోదావరి.ఏపీ.జీవోవీ.ఐఎన్ లేదా ఏలూరు.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో పొందు పరిచిన దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్హతలు, అన్ని సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, రూ.300 డీడీని దరఖాస్తుకు జతచేసి ఏలూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఈ నెల 16నుంచి 25వ తేదీలోగా కార్యాలయ పనివేళల్లో సమర్పించాలని కోరారు. పోస్టుల భర్తీ జిల్లా నియామకపు కమిటీ (డీఎస్సీ)ద్వారా జరుగుతుందని, ఉద్యోగ ఖాళీల సంఖ్య తగ్గించేందుకు, పెంచేందుకు, నిలుపుదల చేసేందుకు డీఎస్సీకి పూర్తి అధికారం ఉందని స్పష్టం చేశారు.

పనుల ప్రగతిని పర్యవేక్షించాలి: జడ్పీ చైర్మన్

ఏలూరుసిటీ, జవవరి 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవోలతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సమీక్షించారు. ఈ సందర్భంగా పలు అంశాలను ప్రధానంగా చర్చించారు. ప్రొటోకాల్ విష యంలో తగు జాగ్రత్తలు వహించాలని, మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని, జిల్లా పరిషత్ ఆస్తుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె ఎంపీ డీవోలను కోరారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తమ పరిధిలోని ప్రభు త్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సూచించారు. జిల్లా పరిషత్‌లో మంజూరైన పనుల ప్రగతిని పర్యవేక్షించాలని, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ పనుల ప్రగతిని ఆమె సమీక్షించారు. ఈ పనులపై ఆడిట్ జరిపించాలని చెప్పారు. గ్రామాల్లో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ కార్యాలయాల పనితీరు మరింత మెరుగుపరిచేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావు, డిప్యూటి సీఈవో కె.భీమేశ్వర్, పీఆర్ ఈఈలు ఎస్.శ్రీనివాస్, రమణమూర్తి, డ్వామా పీడీ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

వందేభారత్‌కు అదనపు కోచ్‌లు

ఏలూరు క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి విశాఖ, విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు నడుస్తున్న వందేభారత్ రైలుకు అదనంగా కోచ్‌లను ఈనెల 11వ తేదీ నుంచి ఏర్పాటు చేస్తున్నట్టు విజయవాడ దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. రైల్ నంబర్ 20834 సికింద్రాబాద్-విశాఖ, రైల్ నంబర్ 20833 విశాఖ-సికింద్రాబాద్ రైళ్లకు ఇప్పటి వరకు రెండు ఎగ్జిక్యూటివ్ కోచ్‌లు, 14 చైర్‌కార్ కోచ్‌లు ఉన్నాయి. అయితే ఈనెల 11వ తేదీ నుంచి మరో ఎగ్జిక్యూటివ్ కోచ్, మరో మూడు చైర్‌కార్ కోచ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

నేడు పోలవరం పరిశీలనకు పార్లమెంటరీ కమిటీ

పోలవరం జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టుని 11 మంది ఎంపీలతో కూడిన పార్లమెంటరీ కమిటీ శనివారం పరిశీలించనుంది. శుక్రవారం రాత్రికి ఈ బృందం రాజమహేంద్రవరం చేరుకుని అక్కడే బస చేసి శనివారం మధ్యాహ్నం పోలవరం ప్రాజెక్టు కార్యాలయానికి చేరుకుంటారు. పార్లమెంటరీ కమిటీ చైర్మన్ రాజీవ్‌ప్రతాప్ రూడీ నేతృత్వంలో 15 మంది ఎంపీలతో పాటు 27 మంది అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది ప్రాజెక్టులో పలు ప్రాంతాలలో జరుగుతున్న పనులను పరిశీలించనున్నారు. సిడబ్ల్యుసి, పోలవరం ప్రాజెక్టు అథారిటీ సభ్యుల బృం దం, ఇంజనీరింగు అధికారులు ఈ బృందంతో ప్రాజెక్టు పరిశీలన కార్యక్రమంలో పాల్గొంటా రు.

న్యూరోసర్జరీ అసోసియేట్‌గా డాక్టర్ విద్యాసాగర్

ఏలూరు క్రైం, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో న్యూరో సర్జరీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ విద్యాసాగర్ శుక్రవారం విధుల్లో చేరారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్య విధాన పరిషత్‌కు చెందిన డాక్టర్ బంకా రవి కుమార్ న్యూరో సర్జరీ విభాగంలో వైద్య సేవలు అందించేవారు. ఆయనను రెండు నెలల కిందట తిరిగి వైద్య విధానపరిషత్‌కు పంపించడంతో అప్పటినుంచి ఆస్పత్రిలో న్యూరో సర్జరీ విభాగంలో వైద్యులు లేకపోవడంతో వైద్యసేవలు నిలిచిపోయాయి. దీంతో 15 పడకల ట్రామాకేర్‌ను మూసివేశారు. రోడ్డు ప్రమాదం కేసులు, తలకు గాయాలైన కేసులు ఆస్పత్రికి వస్తే విజయవాడ, గుంటూరులకు రిఫరల్ చేస్తున్నారు. ఈ సమస్యను డీఎంఈ అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో అసోసియేట్ ప్రొఫెసర్‌ను నియమించారు. దీంతో ట్రామాకేర్ విభాగంలో న్యూరో సర్జరీ వైద్యసేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్లయ్యింది.

గౌరవ వేతనం విడుదల

ఏలూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో బీఎల్‌వోలకు 2021 సంవత్సరం నుంచి రావాల్సిన గౌరవ వేతనాన్ని విడుదల చేస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. ఏడు నియోజకవర్గాలకు రూ.1,82, 59,500 మంజూరు చేశారు. ఉంగుటూరు రూ.22.41 లక్షలు, దెందులూరు రూ.25.09 లక్షలు, ఏలూరు రూ.22.02 లక్షలు, పోలవరం రూ.29.82 లక్షలు, చింతలపూడి రూ.28.60లక్షలు, నూజివీడు రూ.30.03 లక్షలు, కైకలూరు రూ.24.61 లక్షలు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు కృతజ్ఞతలు తెలిపారు.

సర్వీస్ సర్టిఫికెట్ ఇవ్వండి సారూ..!

కొత్తజిల్లాల ఏర్పాటుతో ఉమ్మడి జిల్లా స్టాఫ్‌నర్సులకు ఇక్కట్లు

ఏలూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో చేపట్టిన ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్ నర్సు ఉద్యోగ నియామకాల ప్రక్రియలో ఇన్‌సర్వీస్ స్టాఫ్ నర్సులు ఇక్కట్లపాలవుతున్నారు. రాజమహేంద్రవరం రీజియన్ జోన్-2 (ఉభయగోదావరి, కృష్ణాజిల్లాలు) పరిధిలో మొత్తం 155 స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్‌ను రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పద్మాశశిధర్ విడుదల చేసిన విషయం విదితమే. ఈ నియామకాల్లో ఇన్‌సర్వీస్ స్టాఫ్‌నర్సులకు వెయిటేజీ ఇచ్చారు. ఈ ప్రయోజనాన్ని పొందాలంటే సంబంధిత స్టాఫ్‌నర్సు ఇప్పటి వరకు పనిచేసిన ఆస్పత్రి నుంచి సర్వీస్ సర్టిఫికెట్‌ను ఏలూరులో నిర్వహిస్తోన్న జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అధికారుల నుంచి తీసుకుని ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్ నర్సు ఉద్యోగ నియామకాల దరఖాస్తుకు జతచేసి సమర్పిం చాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 17వ తేదీతో గడువు ముగియనుంది. తాజాగా చేపట్టిన ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు వేతనం అధికంగా నిర్ధారించడంతో ఈ పోస్టులకు సహజంగానే డిమాండ్ నెల కొంది. ఆ ప్రకారం సర్వీస్ సర్టిఫికెట్లకోసం సంబంధిత విభాగాల జిల్లా హెచ్‌వోడీల వద్దకు వెళ్ళే ఇన్‌సర్వీస్ స్టాఫ్ నర్సులకు చుక్కలు చూపిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నేళ్ళుగా పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లాకేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిల్లో పనిచేసిన స్టాఫ్‌నర్సులు కొత్తజిల్లాల ఏర్పాటుతో ఇపుడు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఆస్పత్రులు కొత్తజిల్లాల ఏర్పాటు కారణంగా ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరిజిల్లాలకు వారి సర్వీసులు విభజన జరిగాయి. ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్‌నర్సు ఉద్యోగ నియామకాల్లో వెయిటేజీ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నిస్తోన్న ఇన్‌సర్వీస్ స్టాఫ్ నర్సులకు ఇపుడు జిల్లాల విభజన కారణంగా సర్వీస్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఆయా కొత్త జిల్లాలు, విభాగాలు, అధికారులు వేర్వేరుగా ఉండటంతో సమస్య జటిలమైంది. మరోవైపు ఏపీవీవీపీ ఆధ్వర్యంలో నడిచే ఏలూరులోని



జిల్లాకేంద్ర ప్రభుత్వాసుపత్రి రెండేళ్ళ క్రితం నుంచి వైద్యవిద్య డైరెక్టరేట్ ఆధ్వర్యంలోని ప్రభుత్వ వైద్యకళాశాల బోధనాసుపత్రిగా మారిపోవడంతో పరిపాలనాపరంగా యంత్రాంగం మొత్తం మార్పుచెందింది. దీంతో ఇన్‌సర్వీస్ స్టాఫ్‌నర్సులకు ఇన్‌సర్వీస్ సర్టిఫికెట్లు జారీ చేయడానికి పలుచోట్ల అడ్డంకులు, అభ్యంతరాలు, సందేహాలను సంబంధిత విభాగాల హెచ్‌వో డీలు వ్యక్తపరుస్తూ తీవ్రజాప్యం చేస్తున్నారని స్టాఫ్‌నర్సులు ఆరోపిస్తున్నారు.

ఇబ్బంది పెడుతున్నారు..

ఉమ్మడి జిల్లాలో పనిచేసిన కాలానికి తమవద్ద సమాచారంలేదని కొందరు, పూర్వపు పనికాలానికి తాము సర్వీస్ సర్టిఫికెట్ ఇవ్వలేమని ఇంకొందరు, ప్రస్తుత ఎన్‌హెచ్‌ఎం నియామకాలకు సంబంధించి మాత్రమే సర్టిఫికెట్ ఇస్తామని మరొకొందరు హెచ్‌వోడీలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఏపీ కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు దయామణి ఆరోపించారు. ఒక్క ఏలూరు జీజీహెచ్(ప్రస్తుతం వైద్యకళాశాల బోధనాసుపత్రి)లోనే గతంలో పనిచేసిన 35మంది స్టాఫ్‌నర్సులు ఇన్‌సర్వీస్ సర్టిఫికెట్లకోసం అర్హతలు కలిగిఉన్నారని వివరించారు. ఇదే పరిస్థితి ఉమ్మడి జిల్లాలో అన్ని పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఉంద న్నారు. సంబంధిత హెచ్‌వోడీల కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్‌కేడర్ అధికారులు ధ్రువీకరించినప్పటికీ సర్వీస్ సర్టిఫికెట్లపై సంతకంచేయడానికి ఉమ్మడి జిల్లాపరిధిలోని మూడుజిల్లాల అధికారులు సాకులుచూపిస్తూ నిరాకరిస్తున్నారని ఆరోపించారు. దరఖాస్తుకు గడువు సమీపిస్తున్నందున అర్హులైన వారందరికీ సర్వీస్ సర్టిఫికెట్లు ఇవ్వకపోతే ప్రభుత్వానికి ఫిర్యాదుచేస్తామని హెచ్చరించారు.





వివేకానంద, సరస్వతిదేవి విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల, ఎంపీ పురందేశ్వరి

సామాజిక స్థితులపై అవగాహన కల్పించాలి

నరసాపురం టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు విద్యార్థులకు సామాజిక స్థితిగతులు, సంస్కృతి సంప్రదాయాలు, మాతృ బాషపై అవగాహన కల్పించే విధంగా బోధనలు ఉండాలని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం వైఎన్ కళాశాల ప్లాటినం వేడుకలకు మంత్రి నిమ్మల రామానాయుడు, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి, విప్ నాయకర్, మైనార్టీ విభాగం ప్రభుత్వ సలహాదారు షరీఫ్, హైకోర్టు విశ్రాంతి న్యాయమూర్తి భవాని ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే జానకీరామ్, గజల్ శ్రీనివాస్, ఆర్డీవో దాసిరాజు విచ్చేసి విద్యార్థుల్ని ఉద్దేశించి మాట్లాడారు. ముందుగా పురందేశ్వరి కాలేజీలో సంక్రాంతి సంబరాలు ప్రారంభించి సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇటు మంత్రి నిమ్మల వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఉదయం జరిగిన వేడుకల్లో పురందేశ్వరి అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ వైఎన్ కళాశాల ఎందరో విద్యార్థుల్ని మేధావులుగా తీర్చిదిద్దిందన్నారు. దేశ, విదేశాల్లో ఈ కళాశాల విద్యార్థులు ఉన్నతస్థితిలో స్థిరపడటం కళాశాల నేర్పిన క్రమశిక్షణే కారణమన్నారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ వైఎన్ కళాశాల అంటే విజ్ఞాన గని అన్నారు. తమతో పాటు ఎంతో మంది ఈ కళాశాలలో చదివి ఉన్నత స్థితిలో ఉన్నామన్నారు. ప్రతి విద్యార్థి ప్రణాళిక బద్ధంగా చదవాలన్నారు. కార్యక్రమంలో పొన్నపల్లి రామారావు, పోలిశెట్టి రఘు, అందే సతీష్, మాజీ వీసీ పద్మరాజు, ప్రిన్సిపాల్ కనకరావు, పాలంకి సుబ్రయన్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, పీవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

19వ తేదీకి పాఠశాలలపై చిత్తు ప్రతిని సిద్ధం చేయండి

క్లస్టర్ల హెచ్‌ఎంలు, ఎంఈవోలతో పాఠశాల విద్య కమిషనర్ సమావేశం

ఏలూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే జూన్ నుంచి ప్రారంభం కానున్న నూతన విద్యాసంవత్సరంలో ఆవిష్కృతం కానున్న ఐదురకాల పాఠశాలల విధానంపై ప్రభుత్వం ప్రతిపాదించిన సంస్కరణలపై వివరణ, అభిప్రాయాల సేకరణకు శుక్రవారం సాయంత్రం వెబెక్స్ పద్ధతిన జిల్లాలోని ఎంఈవోలు, క్లస్టర్ల ప్రధానోపాధ్యాయులతో పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ప్రస్తుత పాఠశాలలస్థానే పంచాయతీని యూనిట్‌గా తీసుకుని క్లస్టర్లవారీగా గతేడాది డిసెంబరు 31వ తేదీనాటి ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా ఏర్పాటు చేయతలపెట్టిన శాటిలైట్, ఫౌండేషన్, బేసిక్, మోడల్, హైస్కూల్స్‌పై ఈ నెల 19 నాటికల్లా చిత్తుప్రతి (రఫ్ కాపీ)ని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. దీనిపై ఈ నెల 21న తాను స్వయంగా ఏలూరువచ్చి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా క్లస్టర్ హెచ్‌ఎంలు, ఎంఈవోలతో మాట్లాడి ఓ నిర్ధారణకు వస్తానని పేర్కొన్నారు. కొత్తగా ప్రతి పంచాయతీలో ప్రారంభించనున్న మోడల్ స్కూల్స్‌లో కనీసం 60 మందికి పైగా బాలబాలికలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో నిర్దేశిత రోల్‌కంటే తక్కువ మంది విద్యార్థులుంటే అక్కడ మౌలిక సదుపాయాలను పరిశీలించాలని కోరారు. క్షేత్రస్థాయి క్లస్టర్ల ఆధారంగా, స్థానిక పరిశీలన తర్వాతే ఐదురకాల పాఠశాలల విధానానికి తుదిరూపునిస్తామని స్పష్టం చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలల కొనసాగింపు అక్కడి విద్యార్థుల సంఖ్యపైనే ఆధారపడి ఉంటుందన్నారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ కొత్త విధానంపై ముసాయిదాను తయారు చేయడానికి ఈనెల 17న క్లస్టర్ హెచ్‌ఎంలు, ఎంఈవోలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. జిల్లాలో నూతన పాఠశాలల విధానానికి రూపకల్పన చేసేందుకు క్లస్టర్ల నోడల్ అధికారి, డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు వ్యవహరిస్తారు. సమావేశంలో జిల్లాలోని 161 క్లస్టర్ల హెచ్‌ఎంలు, 40మంది ఎంఈవోలు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి
భార్య పిల్లలకు తీవ్ర గాయాలు



కలిదిండి/కాళ్ళ జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కలిదిండి మండలం సంతోషపురం గ్రామానికి చెందిన దోణాద్రి ఆంజనేయులు (38) గురువారం రాత్రి భార్య పిల్లలతో బైకుపై వెళ్తుండగా, కాళ్ళ మండలం సీసలి సాయిబాబా ఆలయ సమీపంలో ఎదురెదురుగా బైకులు ఢీకొనటంతో ఆంజనే యులు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య, ఇద్దరు పిల్లలకు తీవ్ర గాయాలవ్వటంతో భీమవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాళ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిని ఢీకొన్న లారీ

గణపవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గణపవరంకు చెందిన కందికట్ల చిన్నమ్మ (75) భిక్షాటన చేస్తుంది. కృష్ణాజిల్లా ముదునేపల్లి నుంచి గణపవరం వస్తుండగా గణపవరం సెంటర్‌లో చిన్నమ్మను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన చిన్నమ్మ కొనూపిరితో కొట్టుమిట్టా డింది. 108లో సిబ్బంది చిన్నమ్మను తాడేపల్లి గూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్ళారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): దెందులూరు మండలం దోసపాడు గ్రామానికి చెందిన సోమయ్య(40)ను గురువారంరాత్రి దోసపాడు గ్రామంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ దగ్గర గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సోమయ్యకు తీవ్రంగా గాయపడడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా కేసు నమోదుచేసి, ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

డాబా పైనుంచి పడి మహిళ మృతి

ఏలూరు క్రైం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఏలూరులోని బూరాయిగూడేనికి చెంది చీలి లక్ష్మి(55) శుక్రవారం ఉదయం నిద్రలేచిన తరువాత కళ్ళు, తిరిగి, ప్రమాదవశాత్తు పైనుంచి కిందపడింది. తీవ్రంగా గాయ పడిన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా కేసు నమోదుచేసి, ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఏలూరు జిల్లాలో కోడి పందేలపై ఉక్కుపాదం

ఏలూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడైనా కోడిపందేలు నిర్వహించాలంటే భయపడేలా అధికారులు చర్యలు ఉండాలని, కోడి పందేలపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఎస్పీ కేపీఎస్ కిశోర్‌తో కలిసి జిల్లా, మండల అధికారులు, పోలీస్, ఎక్సైజ్ అధికారులతో వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కోర్టు ఉత్తర్వుల మేరకు కోడిపందేలు, జూదం, గుండాట, మద్యం అక్రమ రవా ణాపై నిరంతరం గట్టి నిఘా ఉంచాలన్నారు. డీఎస్పీలు, ఎస్‌హెచ్‌వోలతో సమన్వయం చేసుకుని పర్యవేక్షించా లని, సబ్ కలెక్టరేట్, రెవెన్యూ డివిజల్ అధికారు లు తమ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ కోడి పందేలు, బెట్టింగ్, పేకాట నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ కిశోర్

బరులపై పోలీసుల కన్నెర్ర



జంగారెడ్డిగూడెం మండలంలో బరులను ధ్వంసం చేయిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

టి.నరసాపురం/కొయ్యలగూడెం/జంగారెడ్డిగూడెం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): టి నరసాపురంలోని పామాయిల్ తోటలో పందేల రాయుళ్ళు సంక్రాంతికి ముందుగానే బరులు సిద్ధం చేయడంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆ స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో ధ్వంసం చేశారు. ఎస్సై ఎం.జయబాబు, తహసీల్దార్ సాయిబాబా ఆధ్వర్యంలో సిబ్బంది ధ్వంసం చేశారు. కొయ్యలగూడెం మండలం గవరవరం, రాజవరం గ్రామాల్లో తహసీల్దార్ చల్లన్న దొర, ఎస్ఐ చంద్రశేఖర్ కోడిపందేల బరులను ధ్వంసం చేశారు. జంగారెడ్డిగూడెం మండలంలోని లక్కవరం, శ్రీనివాసపురం గ్రామాల్లో కోడిపందేల నిర్వహణకు సిద్ధం చేసిన బరులను జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర, తహసీల్దారు కె.స్లీవజోజి ఆధ్వర్యంలో శుక్రవారం జేసిబిలతో ధ్వంసం చేశారు. సీఐ కృష్ణబాబు, ఎస్ఐ ఎస్‌కె.జబీర్ పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

ఏలూరు క్రైం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కోడిపందేలు, బెట్టింగ్‌ల నియంత్రణకు అనువుగా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలతోపాటు సబ్ కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు 18812 224519, టోల్ ఫ్రీనెంబర్ 1800 2331077 నంబర్లకు సమాచారం అందించాలని ఆమె కోరారు. జిల్లా ఎస్పీ కార్యాలయం ఫోన్ నంబర్ 9550351100/112, ఏలూరు ఆర్డీవో కార్యాలయం 7842530956, నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం 08656 232717, జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం 8309705048 నంబర్లతో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు.

వైఎస్‌ఆర్ విగ్రహం ధ్వంసం

కొత్తపాలెంలో ఘటన

ఐదుగురి అనుమానితుల అరెస్టు



మొగల్తూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కొత్తపాలెంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనితో మండల వైసీపీ అధ్యక్షుడు రేవు నారాయణమూర్తి, జడ్పీటీసీ తిరుమాని బాపూజీ, పాలా రాంబాబు, కొత్తపల్లి బాబి, తన్నీడి గిరి, పడవల సత్యనారాయణ, కొల్లాబత్తుల రవి, నిప్పులేటి బోసు, వేగి రాజశేఖర్, కోడెల్లి వెంకట్రావు, లింగం ఏసుబాబు, కర్రి ఏసుబాబులు చేరుకుని ఆందోళన నిర్వహించారు. ఈ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు గత ఏడాది జూన్ నెలలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రయత్నించి విగ్రహాన్ని కొద్దిమేర కత్తులతో చెక్కారు. గురువారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఈ విగ్రహాన్ని ధ్వంసం చేయడంతో సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీవేద, సీఐ దుర్గా ప్రసాద్, మొగల్తూరు ఎస్ఐ జి.వాసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. భీమవరం నుండి పోలీస్ జాగిలంతో పాటు క్లూస్ టీమ్ సభ్యులు వచ్చి విగ్రహంపై గల వేలి ముద్రలు నమోదు చేశారు. స్థానిక వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొగల్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈకేసులో ఆరుగురు అనుమానితులను గుర్తించిన పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

సాయంత్రానికి నూతన విగ్రహం ఏర్పాటు

వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసంతో స్పందించిన స్థానిక వైసీపీ నాయకులు శుక్రవారం సాయంత్రానికి అదే గ్రామానికి చెందిన నాటి విగ్రహదాత కుటుంబ సభ్యులు, గ్రామస్థుల సహకారంతో అదే ప్రదేశంలో నూతన విగ్రహాన్ని శుక్రవారం సాయంత్రానికి ఏర్పాటు చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో పురుగుల మందు తాగి ఇద్దరి మృతి

ఏలూరు క్రైం, జవవరి 10 (ఆంధ్ర జ్యోతి): కొయ్యలగూడెం మండలం కాళింగిపేటకు చెందిన చింతాడ కర్నుడు(62) ఏ కారణమో తెలియదు కానీ ఈనెల 9వ తేదీ గురువారం పురుగు మందు తాగి తీవ్ర అస్వస్థతకు గుర య్యాడు. అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా కేసు నమోదు చేసి, ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులకు సమా చారం ఇచ్చారు. నల్లజర్ల మండలం పోతిరెడ్డి పాలెంకు చెందిన లింగాల రాంబాబు(30) ఏ కారణమో తెలియదు కానీ ఈనెల 9వ తేదీ గురువారం పురుగుమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతనిని ఏలూరు ప్రభుత్వా సుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. ఆసు పత్రి వైద్యులు ఎమ్మెల్సీగా కేసు నమోదుచేశారు.



శ్రీవారు, అమ్మవార్ల దివ్యమూర్తులు

కనుమ ఉత్సవానికి ఏర్పాట్లు

ద్వారకాతిరుమల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రంలో కనుమ మహోత్సవానికి ఏర్పాట్లు ఈవో వేంద్ర త్రినాథరావు శుక్రవారం పరిశీలించారు. ఈనెల 15న సమీప గ్రామమైన దొరసానిపాడులో ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. మండపాన్ని, పరిసరాలను సిబ్బంది సుందరీకరించారు. సంక్రాంతి పర్వదినాలలో కనుమ రోజున చినవెంకన్న, ఉభయ దేవేరులతో కలసి ఆ గ్రామానికి వెళతారు. స్వామి ఆగమనం కోసం గ్రామస్తులు భక్తిప్రపత్తులతో ఎదురుచూస్తారు.

ముక్కోటి పర్వదినం మొదలుగా ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పదిరోజుల పాటు జరపడం సంప్రదాయం.



ఎంపీ పురందేశ్వరికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ట్రస్టీ నివృతరావు

చిన వెంకన్నను దర్శించిన ఎంపీ పురందేశ్వరి

ద్వారకాతిరుమల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న క్షేత్రంలో ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లు బావున్నాయని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి కితాబునిచ్చారు. శ్రీవారి ఆలయాన్ని ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శుక్రవారం సందర్శించారు. ఉత్తర ద్వారం గుండా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి మూల విరాట్, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తరువాత ఆలయ అర్చకులు వారికి స్వామి వారి శేషవస్త్రాలను కప్పి వేదాశీర్వచనం పలికారు. ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వి నివృతరావు నుంచి స్వామివారి చిత్రపటాలను ప్రసాదాలను అందుకున్నారు.



పూజలుచేస్తున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

డీఈవో కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు

ఏలూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): డీఈవో కార్యాలయ ప్రాంగణంలో సంక్రాంతి వేడుకలను శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. భోగిమంటలు, పొంగలి వంటకం, గంగిరెద్దు విన్యాసాలు, హరిదాసుల కీర్తనలతో కార్యాలయ ఆవరణలో వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు ఉల్లాసంగా గడిపారు. తొలుత భోగిమంటను వెలిగించిన డీఈవో వెంకటలక్ష్మమ్మ స్వయంగా పొంగలి తయారు చేశారు. మహిళా ఉద్యోగులకు రంగవల్లుల పోటీని నిర్వహించారు. అవధాని, షరీఫ్, శ్రీకాంత్, మోహన్, క్రాంతికిరణ్, వంశీకృష్ణ, ఐ.సుధాకర్, ఝాన్సీరాణి, సమగ్రశిక్ష కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



దివ్యాంగుల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారి రత్న ప్రసాద్

విభిన్న ప్రతిభావంతులకు న్యాయ సహాయం అందిస్తాం

ఏలూరు క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వ పథకాలు పొందడం, ఆస్తులు పొందడంలో సమస్యలు ఉత్పన్నమైతే జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయ సహాయాన్ని అందిస్తుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.రత్న ప్రసాద్ అన్నారు. తంగెళ్ళమూడి విన్సెట్ డిపాల్ మానసిక విభిన్న ప్రతిభావంతుల వసతి గృహాన్ని శుక్రవారం సందర్శించి సదుపాయాలను పరిశీలించారు. ఎటు వంటి సాయం కావాల్సి వచ్చినా 15100 టోల్ ఫ్రీనెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. అన్నే డీసీ ప్యానల్ లాయర్ వెంకటేశ్వరరావు, వలంటీరు మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఎస్ఎస్ యాప్‌పై అవగాహన

పెదపాడు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వట్లూరు రైతు సేవా కేంద్రంలో ఎన్‌పీఎస్ఎస్ యాప్‌పై శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కె.హబీబ్ బాషా పాల్గొని యాప్‌పై రైతులకు అవగాహన కల్పించారు. యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా పంటకు తెగులు సోకితే చేపట్టాల్సిన చర్యలు, సూచనలు తెలుసుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. పెదపాడు ఏవో వి.ప్రదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కోటి పూజలు

ఉత్తర ద్వారంలో స్వామి వారిని దర్శించుకున్న భక్తులు



చింతలపూడి రామాలయంలో ఉత్తర ద్వార దర్శనం



పెదపాడులో వేణుగోపాలస్వామికి పూజలు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పర్వదినం నగరంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం వేకువజాము నుంచే ఉత్తర ద్వార దర్శనం చేసుకోవాలని భక్తులు జనార్ధనస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాలకు తరలి వెళ్లారు. ఉత్తర ద్వారం నుంచి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయాల వద్ద పోలీసులు రక్షణ ఏర్పాట్లు చేశారు.

● చింతలపూడి: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తెల్లవారుజాము నుంచి పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మారుతీనగర్ ఆంజనేయస్వామి, పాతబస్టాండ్‌లో అభయాంజనేయస్వామి, మేడబడి సెంటర్ కోదండ రామాలయాల వద్ద భక్తులు తెల్లవారుజాము నుంచి బారులు దీరారు. వెలమపేటలో గోదా రంగనాథస్వామికి పూజల అనంతరం పల్లకీలో పుర వీధుల్లో ఊరేగించారు.

● పెదపాడు: స్థానిక రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. అర్చకులు శ్రీనివాసాచార్యులు స్వామివారికి విశేషాలంకరణ, దర్శన ఏర్పాట్లు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

● కామవరపుకోట: స్థానిక పెంటమ్మ రామాలయం వద్ద సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సత్యశ్రీనివాసాచార్యులు, అప్పలాచార్యులు సామూహిక రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతాలను జరిపించారు. మండలంలోని రామాలయాలు, వేంకటేశ్వరస్వామి ఆలయాల వద్ద భక్తులు వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం చేసుకుని ఆరాధించారు. కామవరపుకోట, ఆడమిల్లి, తడికలపూడి, కళ్ళచెరువు, జీలకర్రగూడెం, గుంటుపల్లి, రామన్నపాలెం, తూర్పుయడవల్లి, రావికంపాడు గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

● ఏలూరు: జంగారెడ్డిగూడెం పట్టణంలోని వేణుగోపాలస్వామి, సీతారామస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

● పెదవేగి: ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. విజయరాయి వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం ఐదుగంటలనుంచి భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు.

● నిడమర్రు: మండలంలో వైష్ణవాలయాల్లో స్వామి వారి ఉత్తర దర్శనం ఏర్పాటు చేశారు. ఆలయాలను ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. నిడమర్రు బాల వేంకటేశ్వరస్వామి, అడవికొలను కేశవస్వామి, భువనపల్లి బాల వేంకటేశ్వరస్వామి ఆలయాలు కిటకిటలాడాయి.

● ఉంగుటూరు: గోపీనాథపట్నంలో ముక్కోటి ఉత్సవాలలో భక్తాంజనేయ స్వామికి మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు లక్ష తమలపాకులతో సహస్ర నామ పూజలను చేశారు. వేదాంతం రాజగోపాల చక్రవర్తి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

● టి.నరసాపురం: బొర్రంపాలెం రామాలయం వద్ద సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. భగవంతుని కరెన్సీ నోట్లతో అలంకరించారు. అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనాలు నిర్వహించారు.

పండుగ నాడు వీడని ఆందోళన

లంక గ్రామస్తుల నిరసన



ఆందోళన చేస్తున్న కొల్లేరు లంక గ్రామస్తులు

పెదవేగి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తీరుతో తమకు పండుగ కూడా లేదని కొల్లేరు లంక గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన బాకీ ఉన్న చెరువుల కౌలు సొమ్ము ఇవ్వాలని గడచిన 27రోజులుగా చేపట్టిన నిరసన శుక్రవారం కొనసాగింది. ధనుర్మాసం, ముక్కోటి ఏకాదశి, పండుగ అయినప్పటికీ బాకీ సొమ్ము వసూలుకు చెట్లకింద పడిగాపులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. లంక గ్రామాల నాయకులు నేతల రవి, సైదు సత్యనారాయణ మాట్లాడుతూ బాకీసొమ్ము వసూలుకు 27రోజులుగా అలుపెరుగని పోరాటం చేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే నుంచి ఎటువంటి స్పందని లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది వయస్సు చిన్నారితో సహా నిరసనలో కూర్చున్న మోరు జయశ్రీ మాట్లాడుతూ శుక్రవారం వైకుంఠ ఏకాదశి అయినప్పటికీ బాకీ సొమ్ము కోసం పసిపిల్లలతో చెట్లకింద పడిగాపులు పడాల్సి వస్తోందని విచారంగా చెప్పారు. అబ్బయ్యచౌదరి ఇవ్వాల్సిన బాకీ సొమ్ము తీసుకునేవరకు విశ్రాంతి లేదని ఆమె స్పష్టంచేశారు. కార్యక్రమంలో లంకగ్రామస్తులు సైదు కృష్ణలీల, ఘంటసాల శ్రీహరి, హరికృష్ణ, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు హామీ లేని రుణాలివ్వాలి



వ్యవసాయాధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు హామీలేని రుణాలు మంజూరు చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. రైతు సంఘ నాయకులు పి.జమలయ్య బృందం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి అందజేశారు. జమలయ్య మాట్లాడుతూ జిల్లాలో 70 నుంచి 80 శాతం మంది కౌలు రైతులే పంటలు పండిస్తున్నారని, బ్యాంకులు వీరికి పంట రుణాలు మంజూరులో సహకరించడం లేదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు మన్నవ కృష్ణచైతన్య, రాయంకుల లక్ష్మణరావు, దొంత కృష్ణ, మధు, కృష్ణ, చంగల వెంకటేశ్వరరావు, కొక్కెరపాటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

కృష్ణాడెల్టా పరిధిలో ధాన్యం కొనుగోలు టార్గెట్స్ పూర్తయ్యాయనే పేరుతో రైతులు, కౌలు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయక పోవడం ఏమిటని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రశ్నించారు. శుక్రవారం అన్నే భవనంలో ధాన్యం కొనుగోలు సమస్యలపై మాట్లాడారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. కృష్ణా డెల్టాలోని పెదపాడు, ఏలూరు, దెందులూరు మండలాల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు, మిల్లులకు ఇచ్చిన టార్గెట్స్ పూర్తయిందని రైతుల నుంచి ధాన్యం సేకరించకపోవడం తగదన్నారు. ప్రతీ గింజ కొనుగోలు చేస్తామని చెప్పి కల్లాల్లోని ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా అన్నదాతలను ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు. కొనుగోలు లక్ష్యాలను పెంచి రైతులు, కౌలు రైతుల నుంచి ధాన్యం వెంటనే సేకరించాలని కోరారు. నాణ్యమైన గోనె సంచులు అందించాలన్నారు. కృష్ణా డెల్టా పరిధిలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఎకో జోన్ పేరుతో కొల్లేరు ప్రజల పొట్ట కొట్టొద్దు

ఏలూరు రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎకో సెన్సిటివ్ జోన్ (పర్యావరణ సున్నిత ప్రాంతం) పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 26 రకాల నిబంధనలు పెట్టి 89గ్రామాల పరిధిలోని లక్షలాది మంది ప్రజలను నిరాశ్రయులను చేసే చర్యలను తక్షణం ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్, ఆర్.లింగరాజు అన్నారు. తిమ్మరావుగూడెం, కె.దుర్గాపురం, చాటపర్రు, గుడివాకలంక, తదితర గ్రామాల్లో శుక్రవారం వారు పర్యటించారు. కొల్లేరు గ్రామాల ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 2006లో కొల్లేరు ఆపరేషన్ పేరుతో ఐదో కాంటూరు లోపల వేలాది ఎకరాల చెరువులను ధ్వంసం చెయ్యడంతో లక్షలాది మంది కొల్లేరు వాసులు జీవనం నాశనమైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నాటి నుంచి నేటి వరకు కొల్లేరు ప్రాంతవాసులకు ఉపాధి లేక సుదూర ప్రాంతాలకు వలసపోతున్నారన్నారు. కొల్లేరును ఐదో కాంటూరు నుంచి మూడో కాంటూరుకు కుదిస్తూ అసెంబ్లీ సైతం తీర్మానాలు చేసినప్పటికీ నేటికీ అమలు జరగకపోవడం విచారకరమన్నారు. ఆందోళనలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

బాల్య వివాహ నిరోధంపై అవగాహన

ఏలూరు రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం, ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహ నిరోధంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఆర్.వినోద్‌కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహం చట్టరీత్యా నేరమన్నారు. చిన్న వయసులో బాలికలకు పెళ్లిచేస్తే భవిష్యత్‌లో అనేక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. బాల్య వివాహాన్ని నిరోధించడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. మహిళా పోలీస్, సీఎస్‌డబ్ల్యూ జి.రాజ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటం రాంబాబు జన్మదిన వేడుకలు



జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న ట్రాన్స్‌కో డీఈ, సిబ్బంది

కొయ్యలగూడెం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జంగారెడ్డిగూడెంలో ఆయన ఇంటి వద్ద వేడుకలు నిర్వహించారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు వివిధ శాఖల అధికారులు అభిమానులు పెద్దఎత్తున కరాటం రాంబాబు కార్యాలయానికి తరలివచ్చి పుష్పగుచ్ఛాలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఐక్యత చాటుతున్న నాయకులు

ఏలూరు రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మె చేపడతామని ఏపీ స్టేట్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి అజయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి కె.సత్యనారాయణ హెచ్చరించారు. డీసీసీబీ వద్ద శుక్రవారం జరిగిన ధర్నాలో వారు పాల్గొన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ధర్నాలో పాల్గొన్నారు. సొసైటీ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చెయ్యాలని, గ్రాడ్యుటీ చెల్లించాలని ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, సొసైటీల ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని నినదించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, 2019లో జారీ చేసిన జీవో నెంబర్ 36 అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, పలువురు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు



మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షల్లో కార్మికులు

ఏలూరు టూటౌన్, జనవరి10 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద శుక్రవారం దీక్షలను ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు సోమయ్య ప్రారంభించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తాఫఅలీ, రవికుమార్ మాట్లాడుతూ సంవత్సరాలు గడుస్తున్న మున్సిపల్ ఉద్యోగుల, కార్మికుల సమస్యలు ప్రభుత్వాలు పరిష్కరించడం లేదన్నారు. సంవత్సరం క్రితం వైసీపీ సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.21వేలు చెల్లించాలన్నారు. స్వీపర్లకు రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీల్లో పని చేసే కార్మికులకు చెప్పులు, కొబ్బరినూనె, సబ్బులు ఇవ్వాలన్నారు. జాన్‌బాబు, ఎల్.కృష్ణారావు, సోమేశ్వరరావు, ఎ.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో 24 నుంచి సమ్మె

చింతలపూడి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఏరియా ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని, లేకుంటే ఈ నెల 24 నుంచి సమ్మె చేపడతామని ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి టి.బాబు తెలిపారు. ఏరియా ఆసుపత్రిలో నోటీసు అందచేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుధ్య కార్మికులకు 18 నెలల పీఎఫ్, ఐదు నెలల పెండింగ్ జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్‌కు ఈనెలతో కాంట్రాక్టు ముగుస్తుందని, కనుక సమస్య పరిష్కరించాలని కోరారు.

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ : ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. చేబ్రోలు పీహెచ్‌సీలో రిలయన్స్ నిధులతో నిర్మించిన అత్యవసర భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ రాంధే లక్ష్మి సునీత, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, కూటమి నాయకులు పాతూరి విజయకుమార్, కడియాల రవిశంకర్, ఇమ్మణ్ణి గంగాధరరావు, బొమ్మిడి అప్పారావు, రాంధే రాజారావు, ఎంపీడీవో రాజ్ మనోజ్, చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారులు వర్మ, శ్రావణ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. ఐసీయూలో ఈసీజీ, ఆక్సిజన్, బీపీ నియంత్రించే పరికరాన్ని బూరుగుపల్లి ఆంజనేయులు జ్ఞాపకార్థం అందిస్తానని ఆయన కుమారుడు నాగేంద్ర హామీ ఇచ్చారు. నాగేంద్రను ఎమ్మెల్యే ధర్మరాజు అభినందించారు. అనంతరం చేబ్రోలులో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులను ఎమ్మెల్యే ధర్మరాజు ప్రారంభించారు.









పెదపాడు, పెదవేగి, టి.నరసాపురం, బుట్టాయగూడెం మండలాల్లో కోడిపందేల నిరోధంపై అవగాహన కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహిస్తున్న రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు

కోడి పందేలు వద్దు

రెవెన్యూ, పోలీస్ శాఖల అవగాహన కార్యక్రమాలు

ఏలూరు క్రైం / పెదపాడు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కోడిపందేలు, జూదం, గుండాట, మద్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని పెదపాడు మండల తహసీల్దార్ ఎ.కృష్ణజ్యోతి అన్నారు. కోడిపందేలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కమిటీ ఆధ్వర్యంలో వట్లూరులోని పలు ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ జ్యోతి మాట్లాడుతూ కోడి పందేలు నిర్వహిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. సంక్రాంతి పండుగ అంటే కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఏలూరు త్రీ టౌన్ ఎస్ఐ కె.ప్రసాద్ మాట్లాడుతూ కోడిపందేలు, బెట్టింగ్ నేరమని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, కోడిపందేల సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 112కు గాని వాట్సాప్ నెంబర్ 9550351100కు సమాచారం అందించాలని సూచించారు. పెదపాడు తహసీల్దారు కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. వట్లూరు సెక్రటరీ మేకా శ్రీనివాస్, పీఆర్వోలు పలువురు పాల్గొన్నారు.

● కామవరపుకోట: గ్రామాల్లో కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తడికలపూడి ఎస్ఐ చెన్నారావు, ఏఎస్ఐ వీరాస్వామి, రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. గతంలో కోడి పందేలు, జూదం నిర్వహించిన వారికి, స్థల యజమానులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామన్నారు. గుంటుపల్లి, తడికలపూడి, ఆడమిల్లి, వెంకటాపురం, రావికంపాడు తదితర గ్రామాల్లో పోలీసులు సమావేశాలు నిర్వహించి హెచ్చరికలు చేశారు.

● పెదవేగి: సంక్రాంతి ప్రతి కుటుంబంలో సంతోషాలు నింపాలని సీఐ కె.వెంకటేశ్వరరావు అన్నారు. కోడిపందేలు, పేకాట, గుండాట జోలికి పోవద్దన్నారు. సంప్రదాయ క్రీడలతో సంక్రాంతి ఇంట్లోకి వస్తుందన్నారు. తహసీల్దారు ఎస్వీ.భ్రమరాంబ, ఎస్ఐ కె.రామకృష్ణ, సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి, సత్యనారాయణ, ఈవోపీఆర్డీ షరీఫ్, కార్యదర్శి పి.వరప్రసాద్, వీఆర్వో అమర్, మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం.జ్యోతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: సంక్రాంతి పండుగ ముసుగులో కోడిపందేలు, జూదం, గుండాట, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ పీవీ.చలపతిరావు హెచ్చరించారు. మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి కోడి పందేల నిరోధంపై చర్చించారు. అధికారులంతా గ్రామాల్లో పర్యటించి కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో కోడిపందేల బరులు ఏర్పాటు చేసేవారు, సహకరించేవారిపై కేసులు నమోదు చేయాలన్నారు. శుక్రవారం ఆరుగురిని బైండోవర్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఎంపీడీవో కె.జ్యోతి, ఎస్సై డి.దుర్గా మహేశ్వరావు, రెవెన్యూ, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: జూదం వద్దని తహసీల్దార్ టి.సాయిబాబా, ఎస్సై ఎం.జయబాబు అన్నారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. గ్రామ కార్యదర్శి ప్రసాద్, కాసన్నేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా ప్రైవేటు అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసేందుకు ఇంటర్ విద్య ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర్ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ముసునూరు, టి.నరసాపురం మండలాల్లో ఒక్కో కళాశాలను ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 31లోగా సెక్రటరీ, కరస్పాండెంట్ పేరు, పుట్టినతేదీ, ఆధార్ జిరాక్స్, ఫోన్ నెంబరు, మెయిల్ తదితర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఏలూరు డీఈవో కార్యాలయ ప్రాంగణంలోని ఇంటర్‌విద్య ఆర్ఐవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. జిల్లాలో ఇప్పటికే నిర్వహణలోవున్న ప్రైవేటు జూనియర్ కళాశాలలు 2025-26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ గుర్తింపు పునరుద్ధరణ, అనుబంధ గుర్తింపు పొందేందుకు, అదనపు తరగతులు, కోర్సు కన్వర్షన్, కొత్త కోర్సులకు అనుమతుల కోసం, సెకండ్ లాంగ్వేజి మార్పు, కళాశాల షిఫ్టింగ్, ఎఫ్‌డీఆర్ రిలీజ్, తదితర అంశాల్లో ప్రభుత్వ అనుమతుల కోసం బీఐఈ లాగిన్ నుంచి ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 28లోగా దర ఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఆర్ఐవో కార్యాలయ సూపరింటెం డెంట్‌ను ఫోన్ నెంబరు 94404 31377లో సంప్రదించాలన్నారు.

పింఛన్‌ల పరిశీలన

ఏలూరుసిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారుల అర్హతలను అధికారులు పరిశీలించారు. ఏలూరు నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఇంటింటికీ వెళ్ళి పింఛన్‌దారుల అర్హతను పరిశీలించారు. గుంటూరు, విజయవాడ, ఒంగోలుకు చెందిన ప్రభుత్వ డాక్టర్లు పాల్గొన్నారు. శనివారపుపేట, మోతేవారితోట, నూకాలమ్మ గుడి ఏరియాలో 90 మంది పింఛన్‌దారులను విచారించారు. డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, డీసీహెచ్ఎస్ పాల్ సతీష్, మున్సిపల్ కమిషనర్ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

ఏలూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం నుంచి పేరంపేట రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమంతో పాటు గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. టీడీపీ నాయకులు దాసరి శ్యామ్ చంద్రశేషు, సాయిల సత్యనారాయణ, రావూరి కృష్ణ, పరిమి సత్తిపండు, పాతూరి అంబేడ్కర్, కుక్కల మాధవరావు, కరుటూరి రమాదేవి, తెలగారపు జ్యోతి, ఘంటా శ్రీను, కిరణ్, సత్యనారాయణ, రమేష్, భార్గవ తదితరులు పాల్గొన్నారు.

వేంగి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఏలూరు రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): యువతను ప్రోత్సహించడానికి వేంగి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు శేఖర్, హరి, వెంకట్, వినయ్, గణేశ్ తెలిపారు. స్థానిక సీఆర్.రెడ్డి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో పోటీలను ఆర్టీసీ విజయవాడ రీజియన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు శుక్రవారం ప్రారంభించారు. తొలి మ్యాచ్‌లో బ్లూవెల్స్, కింగ్ కోహ్లీ జట్లు తలపడ్డాయి. కింగ్ కోహ్లీ జట్టు విజయం సాధించింది. ఏలూరు పరిసర ప్రాంతాలకు చెందిన 16 క్రికెట్ జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు.

గ్రామ వ్యవసాయ సహాయకుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఏలూరు రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా గ్రామ వ్యవసాయ సహాయకుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం వ్యవసాయశాఖ అధికారి హబీబ్ బాషా ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తోర్లపాటి కుమార్, జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి వినోద్‌కుమార్, జిల్లా కార్యదర్శి జిల్లా బాలార్జున్, వ్యవసాయ అధికార సంఘం అధ్యక్షుడు బాలిన వెంకటేష్, పవన్ కుమార్, స్వర్ణలత, పి.ఖాశీప్రసాద్, ఎం.రవిచంద్ర, వేములూరి రాజు, కె.శివనాగరాజు, ఇతర వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వీఆర్వోల క్యాలెండర్..

ఏలూరు రూరల్, జనవరి10 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారులు సంఘం ముద్రించిన కొత్త సంవత్సరం క్యాలెండర్‌ను శుక్రవారం మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆవిష్కరించారని రాష్ట్ర అధ్యక్షుడు భూపతి రాజు రవీంద్రరాజు తెలిపారు. అసోసియేట్ అధ్యక్షుడు రాటకొండ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఎం.లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులు కె.ప్రభాకర్, ఎమ్డీ సయ్యద్ బాజి తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

స్వామి వివేకానంద జయంతి

పెదపాడు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వట్లూరు సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో స్వామి వివేకానంద జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సెట్‌వెల్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు క్విజ్, వ్యాసరచన, డిబేట్ పోటీలను నిర్వహించారు. ప్రతి ఒక్క విద్యార్థి స్వామి వివేకానంద స్ఫూర్తిగా ముందుకు సాగి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పలువురు సూచించారు. కార్యక్రమంలో యూత్ ఆఫీసరు డి.కిశోర్, ఎంప్లాయిమెంట్ ఆఫీసరు సి.మధుభూషణరావు, పీవీఎస్ సత్యనారాయణ, చలసాని విశ్వనాధరావు, ఇంచార్జి ప్రిన్సిపాల్ జి.సరళ తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

చింతలపూడి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : నాగిరెడ్డిగూడెంలో ఎక్సైజ్ అధికారులు సారా స్థావరాలపై దాడి చేశారు. చింతలపూడికి చెందిన షేక్ ఆదాయం, కె.అప్పారావు నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పాత కేసులో ఆరుగురిని బైండోవర్ చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు.

ఏలూరు జిల్లాలో కోడి పందేలపై ఉక్కుపాదం


వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ కిశోర్

ఏలూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడైనా కోడిపందేలు నిర్వహించాలంటే భయ పడేలా అధికారులు చర్యలు ఉండాలని, కోడి పందేలపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ వెట్రి సెల్వి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఎస్పీ కేపీ ఎస్ కిశోర్‌తో కలిసి జిల్లా, మండల అధికారులు, పోలీస్, ఎక్సైజ్ అధికారులతో వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కోర్టు ఉత్తర్వుల మేరకు కోడిపందేలు, జూదం, గుండా ట, మద్యం అక్రమ రవా ణాపై నిరంతరం గట్టి నిఘా ఉంచాలన్నారు. డీఎస్పీలు, ఎస్‌హెచ్ వోలతో సమన్వయం చేసు కుని పర్యవేక్షించా లని, సబ్ కలెక్టరేట్, రెవెన్యూ డివిజల్ అధికారు లు తమ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ కోడి పందేలు, బెట్టింగ్, పేకాట నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కంట్రోల్ రూమ్‌లు

ఏలూరు క్రైం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కోడిపందేలు, బెట్టింగ్‌ల నియంత్రణకు అనువుగా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలతో పాటు సబ్ కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు 18812 224519, టోల్ ఫ్రీనెంబర్ 1800 2331077 నంబర్లకు సమాచారం అందించాలని ఆమె కోరారు. ఎస్పీ కార్యాలయం ఫోన్ నంబర్ 9550351100/112, ఏలూరు ఆర్డీవో కార్యాల యం 7842530956, నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం 08656 232717, జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం 8309705048 నంబర్లతో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు.

19వ తేదీకి పాఠశాలలపై చిత్తు ప్రతిని సిద్ధం చేయండి

క్లస్టర్ల హెచ్‌ఎంలు, ఎంఈవోలతో పాఠశాల విద్య కమిషనర్ సమావేశం

ఏలూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వచ్చే జూన్ నుంచి ప్రారంభం కానున్న నూతన విద్యాసంవత్సరంలో ఆవిష్కృతం కానున్న ఐదురకాల పాఠశాలల విధానంపై ప్రభుత్వం ప్రతిపాదించిన సంస్కరణలపై వివరణ, అభిప్రాయాల సేకరణకు శుక్రవారం సాయంత్రం వెబెక్స్ పద్ధతిన జిల్లాలోని ఎంఈవోలు, క్లస్టర్ల ప్రధానోపాధ్యాయులతో పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ప్రస్తుత పాఠశాలలస్థానే పంచాయతీని యూనిట్‌గా తీసుకుని క్లస్టర్లవారీగా గతేడాది డిసెంబరు 31వ తేదీనాటి ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా ఏర్పాటు చేయతలపెట్టిన శాటిలైట్, ఫౌండేషన్, బేసిక్, మోడల్, హైస్కూల్స్‌పై ఈ నెల 19 నాటికల్లా చిత్తుప్రతి (రఫ్ కాపీ)ని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. దీనిపై ఈ నెల 21న తాను స్వయంగా ఏలూరువచ్చి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా క్లస్టర్ హెచ్‌ఎంలు, ఎంఈవోలతో మాట్లాడి ఓ నిర్ధారణకు వస్తానని పేర్కొన్నారు. కొత్తగా ప్రతి పంచాయతీలో ప్రారంభించనున్న మోడల్ స్కూల్స్‌లో కనీసం 60 మందికి పైగా బాలబాలికలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో నిర్దేశిత రోల్‌కంటే తక్కువ మంది విద్యార్థులుంటే అక్కడ మౌలిక సదుపాయాలను పరిశీలించాలని కోరారు. క్షేత్రస్థాయి క్లస్టర్‌ల ఆధారంగా, స్థానిక పరిశీలన తర్వాతే ఐదురకాల పాఠశాలల విధానానికి తుదిరూపునిస్తామని స్పష్టం చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలల కొనసాగింపు అక్కడి విద్యార్థుల సంఖ్యపైనే ఆధారపడి ఉంటుందన్నారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ కొత్త విధానంపై ముసాయిదాను తయారు చేయడానికి ఈనెల 17న క్లస్టర్ హెచ్‌ఎంలు, ఎంఈవోలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. జిల్లాలో నూతన పాఠశాలల విధానానికి రూపకల్పన చేసేందుకు క్లస్టర్ల నోడల్ అధికారి, డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు వ్యవహరిస్తారు. సమావేశంలో జిల్లాలోని 161 క్లస్టర్ల హెచ్‌ఎంలు, 40మంది ఎంఈవోలు పాల్గొన్నారు.

మార్కెట్లకు సంక్రాంతి కళ

వస్త్ర దుకాణాలు కిటకిట

ఆఫర్లతో హోరెత్తిస్తున్న షాపింగ్ మాల్స్, మోటార్ సైకిల్ షోరూంలు



ఏలూరుసిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వచ్చిందంటేనే మార్కెట్లు కళకళలాడుతుంటాయి. ఏలూరు నగరంతో పాటు జిల్లాలోని ముఖ్య పట్టణాలైన జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు, కైకలూరు తదితర ప్రాంతాల్లో వస్త్ర దుకాణాలు, షాపింగ్ మాల్స్ కిటకిట లాడుతున్నాయి.వస్త్ర దుకణాల్లో ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు.ప్రతి రోజు గిఫ్ట్ ఓచర్లు, సంక్రాతికి బంపర్ డ్రా గిఫ్ట్ ఓచర్లతో పాటు అక్కడ కొనుగోలుకు బట్టి వివిధ రకాల ఆఫర్లను ప్రకటించారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాల షోరూంలలో కూడా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించటంతో ఫ్రిజ్‌లు, టివిలు. ఏసిలు, వాషింగ్ మిషన్లు, మైక్రోఓవెన్స్, వెట్ గ్రైండర్లు, మిక్సీలు వంటి వాటి కొనుగోలుపై వినియోగదారులు దృష్టి సారించారు. సంక్రాంతి వస్తోందంటే కొత్త వాహనాలను కొనుగోలు చేయడం ఆనవాయితీ. వినియోగ దారులను ఆకర్షించే విధంగా మోటార్ సైకిల్ షోరూంలు ప్రత్యేక ఆఫర్లు ప్రకటిం చారు. మెగా లోన్ అండ్ ఎక్సేంజ్ మేళాలను నిర్వహిస్తున్నారు. ఏలూరు సాయి స్వర్ణా మోటార్స్ వారు ఫ్లాష్ సేల్ పేరుతో ఏలూరు నగరంలో పలు చోట్ల ఫ్లాష్ సేల్ పాయింట్లును ఏర్పాటు చేశారు. ప్రతి హీరో వాహనం కొనుగోలుపై 5వేల రూపాయల వరకు క్యాష్‌బ్యాక్ ఆఫర్లు లేదా ఎక్సేంజ్ బోనస్ ఇస్తున్నారు. క్యాష్ ఎంపిక చేసిన బ్యాంకు కార్డులు ద్వారా కొనుగోలుపై 15 వేల రూపాయిల వరకు తగ్గింపు ఇస్తున్నారు. అతి తక్కువ డౌన్ పేమెంట్ 3,999 రూపాయలతో వాహనాలు కొనుగోలు చేయటానికి అవకాశం కల్పిస్తున్నారు. గతంతో పోలిస్తే ఈసారి పోటీతత్వం పెరిగిందని, దీంతో ఆఫర్లు పెంచినా అమ్మకాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటున్నాయని మోటార్ సైకిల్, ఎలక్ట్రానిక్ వస్తువుల షోరూం, వస్త్రదుకాణాల యజమానులు చెబుతున్నారు.

నేడు బలివే ఉత్సవాల ఏర్పాట్లపై బహిరంగ వేలం

ముసునూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు నిమిత్తం శనివారం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఈవో పామర్తి సీతారామయ్య తెలిపారు. వచ్చే నెల 24 తేదీ నుంచి 28వరకు జరిగే ఉత్సవాలకు ఆలయ భూమిలో అద్దె హక్కుకు, కొబ్బరి చెక్కలు పోగుచేసుకునే హక్కుకు, లడ్డు ప్రసాదం తాయారు చేసి ఇచ్చే హక్కుతోపాటు మరికొన్ని ఏర్పాట్లుకు సంబంధించి ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం జరుగుతుందని ఈవో తెలిపారు. ఈ వేలంలో టెండర్లకు సంబంధించి కేటాయించిన దరావత్తు రుసుమును చెల్లించినవారు మాత్రమే వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు. దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో ఈ వేలం జరుగుతుందని ఈవో సీతారామయ్య తెలిపారు.

కోడిపందేల బరులు ధ్వంసం చేసిన పోలీసులు


చిత్తపూరులో కోడిపందేల బరిని తొలగిస్తున్న పోలీసులు

నూజివీడు టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని ఎటువంటి జూదం నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు పట్టణ సీఐ సత్యశ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం నూజివీడు పట్టణంలోని కోడిపందేల నిర్వహణకు ఏర్పాటుచేసిన బరులను రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ధ్వంసం చేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ జ్యోతిబసు, సిబ్బంది పాల్గొన్నారు.

● చాట్రాయి: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని చిత్తపూరులో కోడిపందేల నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తున్న బరిని శుక్రవారం తహసీల్దార్ ప్రశాంతి, ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో తొలగించారు.

● ఆగిరిపల్లి: కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ప్రసాద్ హెచ్చరించారు. ఆగిరిపల్లి మండలంలోని చిన్నాగిరిపల్లిలో ఏర్పాటు చేస్తున్న కోడిపందేల బరులను శుక్రవారం తహసీల్దార్ ప్రసాద్, ఎస్సై శుభశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది బరులను ధ్వంసం చేశారు.

ముదినేపల్లి కూడలి మురికి కూపం



ముదినేపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి సెంటర్ మురికి కూపంలా తయారైంది. ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రాంతంలో మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెద జల్లుతున్నది. వర్షాలు తగ్గినా రోడ్డుపై గోతుల్లో నీటి నిల్వలు తగ్గడం లేదు. ఆ ప్రాంతంలో రోడ్డుపై నడిచేందుకు వీలులేకుండా పోయింది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా డ్రెయిన్ల నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. రోడ్డు మార్జిన్లు పిచ్చిమొక్కలు, గడ్డితో నిండి పోవడంతో రోడ్డుపై నిల్వ ఉన్న నీరు బయటికి పోయే మార్గం లేకుండాపోయింది. శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలో కూడ మురుగునీరు నిల్వ ఉండడంతో శవ పేటికలను తీసు కెళ్లేందుకు గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


ముదినేపల్లిలో రెవెన్యూ, పోలీసు అధికారులు, సిబ్బంది ర్యాలీ


ఆటపాకలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ఇబ్రహీం

జూదాలు వద్దంటూ అవగాహన ర్యాలీ

ముదినేపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం ముదినేపల్లిలో రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ సుభాని, ఎంపీడీవో వై.రామకృష్ణ, ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు, యువకులు ఈ ర్యాలీలో పాల్గొని జూదాలు వద్దు - సంప్రదాయ క్రీడలే ముద్దు అంటూ నినాదాలు చేశారు.

140 మందిపై బైండోవర్

సంక్రాంతి పండుగ సందర్భంగా ముదినేపల్లి మండలంలో గతంలో జూదాలు నిర్వహణకు పాల్పడిన, కోడిపుంజులకు కత్తులు కట్టే వారు 140 మందిపై బైండోవర్ కేసులు పెట్టినట్లు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

కైకలూరు: పండుగను పురస్కరించుకుని పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం అన్నారు. శుక్రవారం కైకలూరు టౌన్ ఎస్ఐ ఆర్.శ్రీను ఆధ్వర్యంలో ఆటపాకలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రూరల్ ఎస్ఐ వి.రాంబాబు ఆధ్వర్యంలో ఆలపాడు, పందిరిపల్లిగూడెం, శృంగవరప్పాడు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.




ఉత్తరద్వారంలో దర్శనమిచ్చిన కైకలూరు మీసాల వెంకటేశ్వరస్వామి.. ముదినేపల్లి మండలం గురజ వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి దర్శనం

ముక్కోటికి మొక్కారు

ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించుకున్న భక్తులు

కైకలూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. వేకువజాము నుండే భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో స్వామి దర్శనం కోసం బారులు తీరారు. కైకలూరు మీసాల వేంకటేశ్వరస్వామిఆలయంలో స్వామి ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయానికి వివిధ రకాల తోరణాలతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయం చుట్టూ నుంచి భక్తులు జాతీయ రహదారి మీదకు బారులుతీరి నిలబడ్డారు. వరహాపట్నం శ్రీలక్ష్మీనృశింహస్వామి ఆలయంలో స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు.

మండవల్లి: మండవల్లిలోని వేంకటేశ్వర స్వామి, రామాలయాలలో వందలాది మంది భక్తులు స్వామికి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింగనపూడి గ్రామంలో స్వామి ఉత్సవమూర్తిని ఊరేగించారు. కానుకొల్లులో రుక్మిణి సత్యభామ సహిత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

కలిదిండి: కలిదిండి వెంకటేశ్వరస్వామి ఆలయం, తాడినాడ సీతారామస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. పెదలంక, పెదపుట్లపూడి అభయాంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముదినేపల్లి: వడాలిలోని సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరలమ్ము నరసింహారావు, పెదగొన్నూరు నీటి సంఘం ఉపాధ్యక్షుడు కట్టా కోటేశ్వరరావు, సర్పంచ్ మరీదు దుర్గాశ్రీ పూజలు చేశారు. గురజ వేణుగోపాలస్వామి ఆలయంలో తెల్ల వారుజాము నుంచే భక్తులు ఉత్తర ద్వార దర్శనంలో పాల్గొన్నారు.

ముసునూరు: భూదేవి,శ్రీదేవి సమేత వెంకటాచలస్వామిని శుక్రవారం ఉత్తరద్వారం నుంచి భక్తులు దర్శించుకున్నారు. అనంతరం మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ గరుడ వాహనంపై స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ దేవినేని వరప్రసాదరావు దంపతుల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు వేదాంతం లక్ష్మీనరసింహాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోగులంపాడులో కోదండ రామాలయం, ముసునూరులో పడమట రామాలయం, గోపవరంలో వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్తరద్వారంలో స్వామివారిని దర్శించుకున్నారు.

నూజివీడు టౌన్: వెంకటాచలస్వామిని ఉత్తరద్వారం ద్వారా భక్తులు దర్శించుకున్నారు గొల్లపల్లి రఘునాథస్వామి, దిగవల్లి సీతారామాంజనేయస్వామి ఆలయం లోనూ ముక్కోటి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఆగిరిపల్లి: శోభనాచల వ్యాఘ్రలక్ష్మి నరసింహస్వామిని ఉత్తర ద్వారం నుంచి భక్తులు దర్శించారు. అనంతరం స్వామివారిని గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అడ్డరోడ్డులోని దాసాంజనేయస్వామి ఆలయం, నెక్కలంగొల్లగూడెంలోని శ్రీదేవిభూదేవిసమేత వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్తరద్వారం దర్శనం ఏర్పాటు చేశారు.


ముసునూరులో గ్రామోత్సవం


నూజివీడులో స్వామివారి దర్శనం


తోటలు పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి

మామిడి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

నూజివీడు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మామిడి సాగులో సస్యరక్షణపై ఉద్యాన అధికారి ఆర్.హేమ సూచనలు ఇచ్చారు. శుక్రవారం నూజివీడు మండలం హనుమంతులగూడెంలో తోటలను పరిశీలించారు. పూతరాని తోటల్లో వేపనూనె 1500 పీపీఎం మూడు మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. తామరపురుగు కనిపిస్తే స్పైనోసాడ్ 0.25 మిల్లీలీటర్లు, థయోమిథాక్సమ్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

తొక్కిసలాట బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

చాట్రాయి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాట దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ 50 లక్షలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి హరనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దుర్ఘటనకు భద్రతా వైఫల్యమే కారణమని మళ్ళీ ఇటువంటి సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈనెల 19న జరిగే సేవ్ ఇండియా సేవ్ డెమోక్రసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. దుర్గం పుల్లారావు, చాట్ల బాబూరావు, వేముల బక్కయ్య, బూతం మారయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గాభవాని, వేదికపై వైస్ ఎంపీపీ, జడ్పీటీసీ, అధికారులు

అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి : ఎంపీపీ

ముసునూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని, వైస్ ఎంపీపీ కోటగిరి రాజా కోరారు. మండల పరిషత్ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలస్యంగా హాజరుకావడం, కొంతమంది గైర్హాజరుపై ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ రాజా మాట్లాడుతూ గ్రామాల్లో పారుశుధ్యం మెరుగుదలకు చెత్త సేకరణ చేపట్టాలన్నారు. జడ్పీటీసీ ప్రతాప్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో జి.రాణి, తహసీల్దార్ పురుషోత్తమశర్మ, రాపర్ల కృష్ణకుమారి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఎంఈవో సుబ్బారావు, ఏవో కె.చిన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జైలు

నూజివీడు టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగి విధు లకు భంగం కలిగించిన వ్యక్తికి నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి నెలరోజులు జైలుశిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం అంపాపురం గ్రామంలోని సర్వేనెంబర్ 294-2లో గల రెండు సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి వ్యాపారం నిర్వహిస్తున్నాడు. తీసివేయమని గ్రామాధికారులు చెప్పినా వినిపించుకోకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏప్రిల్ 29, 2020లో అంపాపురం గ్రామ కార్యదర్శి కోటి లింగమ్మ ఆక్రమణను తొలగిస్తుండగా ఆక్రమణదారుడు శ్రీధర్ ఆమె విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేయగా విచారించిన న్యాయమూర్తి ఆక్రమణదారుడు శ్రీధర్‌కు నెలరోజులు జైలుశిక్ష, రూ.3 వేలు జరిమానా విధిం చారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

చాట్రాయి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరశింహారావుపాలెంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.5,840 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ఇంటర్వ్యూ..

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



రామకృష్ణ, తహసీల్దార్

● **భూ సమస్యల పరిష్కారానికి ఏ చర్యలు తీసుకుంటున్నారు?**

జవాబు : రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై అధిక సంఖ్యలో అర్జీలు వచ్చాయి. ఫీల్డ్‌లోకి వెళ్లి భూ హక్కు పత్రాలను పరిశీలించి సర్వే చేసి భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

● **రెవెన్యూ సదస్సుల్లో ఎన్ని అర్జీలు వచ్చాయి. ఎన్ని పరిష్కరించారు?**

జవాబు : మొత్తం 240 అర్జీలు వచ్చాయి. 30 శాతం పరిష్కరించాం.

● **మండలంలో 22ఏ నిషేధిత జాబితాలో ఎన్ని ఎకరాలు ఉన్నాయి?**

జవాబు : కలిదిండి, లోడిదలంక, సంతోషపురం గ్రామాల్లో మిలటరీ భూమి 1899 ఎకరాలు, మద్దాల శ్రీరంగనాయకుల భూమి 496 ఎకరాలు, భాస్కరావుపేటలో 179 ఎకరాలు, గుర్వాయిపాలెంలో 70 ఎకరాలు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయి.

\- కలిదిండి

పండుగకు కొత్త బట్టలు కొనేందుకు వెళ్తూ..

» రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

» భార్య పిల్లలకు తీవ్ర గాయాలు


ఆంజనేయులు (ఫైల్)

కలిదిండి/ కాళ్ళ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగకు కొత్త బట్టలు కొనేందుకు భీమవరం బయల్దేరిన ఆ కుటుంబంపై విధి చిన్నచూపు చూపింది. మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్య, ఇద్దరు పిల్లలు గాయాల పాలయ్యారు. కాళ్ల పోలీసులు తెలిపిన వివరాలివి. కలిదిండి మండలం సంతోషపురం గ్రామానికి చెందిన దోణాద్రి అంజనేయులు (38) వ్యవసాయ పనులకు వెళ్తుంటాడు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో కొత్త బట్టలు కొనేందుకు గురువారం రాత్రి భార్య, ఇద్దరు పిల్లలతో బైక్‌పై భీమవరం బయల్దేరారు. అయితే కాళ్ళ మండలం సీసలి సాయిబాబా గుడి సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు నిర్లక్ష్యంగా నడుపుతూ వీరి బైక్‌ను ఢీ కొట్టాడు. ఆంజనేయులు కుటుంబ సభ్యులతో సహా రోడ్డుపై పడ్డారు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. భార్య, ఇద్దరు పిల్లలూ గాయపడ్డారు. వీరిని అంబులెన్స్‌లో భీమవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిం చగా అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేప టికే ఆంజనేయులు మృతి చెందాడు. మృతుడి అన్నయ్య కనకరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

కలిదిండి ఇన్‌చార్జి ఎంఈవోగా వెలమల



కలిదిండి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కలిదిండి ఇన్‌చార్జి ఎంఈవోగా వెలమల శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. కైకలూరు ఎంఈవోగా ఆయన పని చేస్తున్నారు. ఎంపీపీ చందన ఉమా మహేశ్వరరావు. సీఆర్పీలు, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

21 మందికి ఉద్యోగాలు

కైకలూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. 62 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా 21 మందికి ఉపాధి అవకాశాలను కల్పించారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి జితేంద్రబాబు, ప్రిన్సిపాల్ శాంతిజ్యోతి, రవి, ప్రసాద్, సునీల్ పాల్గొన్నారు.


లోకేశ్‌తో కాపా శ్రీనివాసరావు

లోకేశ్‌ను కలిసిన కాపా

నూజివీడు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రి నారా లోకేశ్‌ను నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్, రావిచర్ల సర్పంచ్ కాపా శ్రీనివాసరావు ఆయన ఉండవల్లి నివాసంలో కలిశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయింపుకు సహకరించాలని మంత్రిని కోరినట్టు తెలిపారు.